శుక్రవారం
12-01-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 201
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

చైనా క్వైఝౌ-1ఎ పరీక్ష విజయవంతం

జ్యుక్వాన్:
చైనా సరికొత్త ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపింది. జ్యుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి గురువారం టియాన్‌జింగ్-1 02 ఉపగ్రహాన్ని ప్రయోగించింది. క్వైఝౌ-1ఎ కెరియర్ రాకెట్ నిప్పులు కక్కుతూ నింగిలోకి దూసుకెళ్లింది. ఉదయం 11.52 గంటలకు (బీజింగ్ కాలమానం ప్రకారం) దీనిని ప్రయోగించారు. ఆపై నిర్దేశిత కక్షలోకి ప్రవేశపెట్టారు. అంతరిక్ష పర్యావరణాన్ని గుర్తించే తరహా పరిశోధనల కోసం ఈ ఉపగ్రహం వినియోగమవుతుందని అంతరిక్ష కేంద్రం అధికారులు తెలిపారు. క్వైఝౌ-1ఎ రాకెట్ల శ్రేణిలో ఇది 26వ మిషన్‌గా వెల్లడించారు.

వైసీపీ సర్కార్‌కు భారీ షాక్

- టీచర్లకు ఎన్నికల విధులు
- సీఈసీ ఆదేశాలు జారీ
- వివరాల సేకరణలో డీఈవోలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
వైసీపీ ప్రభుత్వానికి కేంద్ర ఎన్నికల సంఘం భారీ షాక్ ఇచ్చింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల విధులకు ఉపాధ్యాయులను దూరంగా ఉంచాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ఎన్నికలను టీచర్ల ద్వారానే నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు డీఈవోలకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఆ దిశగా టీచర్లు, సిబ్బంది వివరాలను డీఈవోలు సేకరిస్తున్నారు. ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు అప్పగించకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. టీచర్లను ఎన్నికల విధులకు దూరంగా పెట్టి, గ్రామ వార్డు సచివాలయ సిబ్బందిని వినియోగించేందుకు ఈ సవరణ

- మిగతా 2 లో

విషమంగానే అంజాన్ ఆరోగ్యం

- లక్నో మాయో ఆసుపత్రిలో చికిత్స
- డి.రాజా పరామర్శ

8లో

అంగన్‌వాడీల అలుపెరగని పోరు

- రాష్ట్రవ్యాప్తంగా 31వ రోజు కొనసాగిన ఆందోళనలు
- ఎస్మాపై ఓటుతో బుద్ధి చెబుతారు : రామకృష్ణ హెచ్చరిక
- సంక్రాంతికీ శిబిరాల్లోనే ఉంటాం
- భోగి మంటల్లో ఎస్మా నోటీసులు కాలుస్తాం
- అంగన్‌వాడీల జేఏసీ హెచ్చరిక

8లో

వైసీపీ మూడో జాబితా విడుదల

- 21 మంది ఇన్‌ఛార్జ్‌ల నియామకం
- కేశినేని, జోగి తదితరులకు చోటు
- ఆరుగురు ఎంపీ, 15 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు
- జాబితాను ప్రకటించిన మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాబోయే ఎన్నికలకు నియోజకవర్గాల ఇన్‌చార్జుల చేర్పులు, మార్పులపై సుదీర్ఘకసరత్తు తరువాత వైసీపీ మూడో విడత జాబితాను విడుదల చేసింది. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సుదీర్ఘ కసరత్తు చేశారు. అనంతరం

- మిగతా 2 లో

సీట్ల పరేషాన్

- ఎమ్మెల్యే రక్షణ నిధి అసంతృప్తి
- జగన్‌తో మంత్రి జోగి రమేశ్ భేటీ
- నరసారావుపేట ఎంపీపై ఉత్కంఠ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
వైసీపీలో సీట్ల మార్పులు, చేర్పులతో నేతల అలకలు, అసంతృప్తులు కొనసాగుతున్నాయి. టికెట్లు ఆశించి నిరాశ చెందిన వారంతా పక్క పార్టీల వైపు చూస్తున్నారు. ఇప్పటికే కొందరు టీడీపీ నేతలతో సంప్రదింపులు చేస్తున్నారు. అక్కడ బెర్తులు దక్కితే వెంటనే పార్టీ మార్పునకు నిర్ణయించుకుంటున్నారు. మరికొందరు ఎటూ తేల్చుకోలేక తర్జనభర్జన పడుతున్నారు. వైసీపీలో టికెట్లు రావని స్పష్టమైన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ఇప్పటికే టీడీపీలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. అదే తరహాగా టీడీపీ నుంచి వైసీపీలోకి వస్తున్నారు. తాజాగా తిరువూరు సిట్టింగ్ ఎమ్మెల్యే రక్షణనిధికి సీటు దక్కదన్న ప్రచారంతో ఆయన అలక వహించారు. సీఎంవో నుంచి ఫోన్ వెళ్లినప్పటికీ ఆయన స్పందించలేదు. ఇప్పటికే విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) వైసీపీలోకి వెళుతున్నట్లు ప్రకటించారు. ఆయన వర్గానికి చెందిన తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్‌కు తిరువూరు టికెట్ ఇస్తారన్న ప్రచారం ఉంది. దీంతో రక్షణనిధికి ఇక సీటు రాదనే ఆందోళనతో ఆయన వర్గం ఉంది. తిరువూరు నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా రక్షణనిధి గెలుపొందారు. పామర్రు ఆయన సొంత నియోజకవర్గం. ఈయన పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

- మిగతా 2 లో

వివాదాల గోపురం

- రామమందిరంపై కాషాయ పార్టీ అత్యుత్సాహం
- రాముడి పేరుతో రాజకీయం
- కాంగ్రెస్, బీజేపీ పరస్పర విమర్శలు
- శాస్త్రాలకు వ్యతిరేకంగా ప్రతిష్ఠాపనంటున్న స్వాములు

న్యూఢిల్లీ :
అయోధ్య... రాముడు... రామ మందిరం ఇదే ఇప్పుడు బీజేపీ నోట... కేంద్రం విస్తృతంగా ప్రచారం చేస్తున్న అంశం. ప్రజాస్వామ్య లౌకిక దేశంలో మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ అడుగుజాడలను తప్పకుండా... హిందూత్వ భావజాలాన్ని అమలు చేసేందుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తోంది. ఇదే ఇప్పుడు అత్యంత వివాదాస్పదమవుతోంది. అయోధ్య... బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ప్రాంతం. బాబ్రీ మసీదు కూల్చివేత అనంత పరిణామాలు రామ మందిర నిర్మాణం దిశగా సాగాయి. అదే సమయంలో రాముడి పేరుతో రాజకీయ లబ్ధికి కాషాయ పార్టీ చేయని ప్రయత్నమూ లేదు. రామ మందిరం... ప్రాణ ప్రతిష్ఠతో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రయోజనం పొందడం ద్వారా కేంద్రంలో తిరిగి అధికారాన్ని నిలబెట్టుకోవాలని బీజేపీ అనేక గిమ్మిక్కులు చేస్తోంది. ఈ విషయంలో మోదీ ప్రభుత్వ తీరును లౌకికతత్వాన్ని, పరమత సహనాన్ని పాటిస్తున్న దేశ ప్రజలే కాకుండా, విపక్ష రాజకీయ పక్షాలు కూడా నిశితంగా విమర్శిస్తున్నాయి. మరోవైపు, రామ మందిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాజకీయ, సినీ, ఇతర రంగాల ప్రముఖులకు ఆహ్వానాలు పంపుతూ కేంద్రం ప్రచార్భాటం చేస్తోంది. ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మఠాధిపతులు, పీఠాధిపతులు, సాధువులు, రాజకీయ నాయకులు, సెలబ్రిటీలతో సహా వేలాది మందిని ఆహ్వానించారు. ఇదే సమయంలో రామ మందిరం ప్రారంభానికి సంబంధించి బీజేపీ, కాంగ్రెస్ నేతలు పరస్పర విమర్శలకు దిగుతున్నారు. తమ అగ్ర నేతలు రామమందిర ప్రారంభోత్సవానికి హాజరు కాబోరని కాంగ్రెస్ స్పష్టం చేయడంతో ఆ పార్టీ లక్ష్యంగా కాషాయ నేతలు విమర్శలు గుప్పించారు. అయితే రామాలయ ప్రారంభోత్సవం బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ వేడుక అని, బీజేపీ రాజకీయ ప్రాజెక్టుగా చేపడుతోందని కాంగ్రెస్ దుయ్యబట్టింది. దీంతో కాంగ్రెస్‌తో పాటు 'ఇండియా' కూటమి పార్టీలు

- మిగతా 2 లో

పందెం కోళ్లు సిద్ధం

- రూ.30 వేల నుంచి లక్షల్లో పుంజుల ధర
- రూ.కోట్లలో వ్యాపారం
- ఆన్‌లైన్‌లోనూ కొనుగోళ్లు
- పందేల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు:
సంక్రాంతి పండుగ సందర్భంగా గోదావరి జిల్లాల్లో పెద్ద ఎత్తున కోడి పందేలకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే నిర్వాహకులు బరులు సిద్ధం చేయగా... భారీ ఎత్తున పుంజుల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఒక్కో పుంజు ధర రూ.30వేల నుంచి లక్షల్లోకి వెళ్లింది. ఇక అనేక రకాల నాటు కోడిపుంజులతో పందెం రాయుళ్లు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోడిపందేలకు పెట్టింది పేరు. ఇక్కడ జరిగే పందేలాను వీక్షించడానికి తెలుగు రాష్ట్రాలలోని రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు తరలివస్తారు. పెద్ద ఎత్తున కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కోడి పందేలకు పుంజులను సిద్ధం చేశారు. కాగా పోలీసు శాఖ పందేల నిర్వహణపై ససేమిరా

- మిగతా 2 లో

చైనా, మాల్దీవుల మధ్య 20 ఒప్పందాలు

సమగ్ర వ్యూహాత్మక సహకార భాగస్వామ్యం ఏర్పాటు

బీజింగ్: చైనా, మాల్దీవుల మధ్య 20 కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఇరు దేశాల ద్వైపాక్షిక బంధాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవడంతో అది సమగ్ర వ్యూహాత్మక సహకార భాగస్వామ్యంగా మారింది. రిపబ్లిక్ ఆఫ్ మాల్దీవులు అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు సతీసమేతంగా చైనాలో పర్యటించిన క్రమంలో బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ముయిజ్జు భేటీ అయ్యారు. పర్యాటకం, సహకారం, విపత్తు నియంత్రణ, బ్లూ & డిజిటల్ ఎకానమీ బలోపేతం, బెల్ట్&రోడ్ ఇనిషియేటివ్ తదితర ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ముయిజ్జుతో జిన్‌పింగ్ మాట్లాడుతూ మారిటైమ్ సిల్క్ రోడ్ ద్వారా తమ మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడ్డాయని గుర్తుచేశారు. సమానత్వం, పరస్పర సహకారం, ప్రయోజనాలను గౌరవిస్తూ 52 ఏళ్లుగా దౌత్య బంధాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో చైనా, మాల్దీవుల సంబంధాలను మరింతగా పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమ ద్వైపాక్షిక బంధాన్ని సమగ్ర వ్యూహాత్మక సహకార భాగస్వామ్యంగా మార్చుకుందామని చెప్పారు. తమ పరిపాలన అనుభవాలను మాల్దీవులతో పంచుకునేందుకు చైనా సానుకూలంగా ఉందని జిన్‌పింగ్ అన్నారు. అభివృద్ధికి వ్యూహాలు, అత్యున్నత నాణ్యతతో బెల్ట్ & రోడ్ సహకారాన్ని పెంచుకునేందుకు చైనా కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. చైనా మాల్దీవుల మైత్రి కొత్త మైలురాయిని చేరుకోనున్నట్లు జిన్‌పింగ్ తెలిపారు. ఆర్థిక, వాణిజ్య, పెట్టుబడులు, వ్యవసాయం, బ్లూ-గ్రీన్-డిజిటల్ ఎకానమీ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచుకోవాలని ఆకాంక్షించారు. తమ దేశంలో మాల్దీవుల విద్యార్థుల చదువుకు మద్దతిస్తామని, రెండు దేశాల మధ్య నేరుగా విమానాలు నడిపేందుకు సహకరిస్తామని జిన్‌పింగ్ హామీనిచ్చారు. ముయిజ్జు మాట్లాడుతూ వన్ చైనా విధానానికి మాల్దీవులు కట్టుబడి ఉందని చెప్పారు. దేశ సార్వభౌమత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని, ప్రాదేశిక సమగ్రత పరిరక్షణకు మద్దతు ఉంటుందని తెలిపారు. మాల్దీవుల్లో జిన్‌పింగ్ పర్యటించి ఈ ఏడాదికి పదేళ్లన్నారు. కాగా, సోమవారం మొదలైన ముయిజ్జు చైనా పర్యటన శుక్రవారంతో ముగియనున్నది.

పాక్, అఫ్ఘాన్‌లో భూకంపం

రిక్టర్ స్కేల్‌పై 6.4 తీవ్రత నమోదు

హిందూ కుష్‌లో భూకంప కేంద్రం

ఇస్లామాబాద్/కాబూల్: పాకిస్థాన్‌లో గురువారం మధ్యాహ్నం భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.4గా నమోదైంది. ఆస్తి, ప్రాణ నష్టం వివరాలు అందలేదు. అయితే భూకంప కేంద్రం అఫ్ఘానిస్థాన్‌లోని హిందూ ఖుష్ ప్రాంతంలో ఉన్నది. మధ్యాహ్నం 2.20 గంటలకు 6.0 తీవ్రతతో భూకంపం 213 కిమీల లోతులో సంభవించినట్లు పాకిస్థాన్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇస్లామాబాద్, లాహోర్, ఖైబర్ పుఖ్‌తుంఖ్వాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో భూమి కంపించిందని పేర్కొంది. హిందూ ఖుష్ ప్రాంతంలోని బదాక్షన్ ప్రావిన్స్‌లోని జుర్మ్ జిల్లాలో 6.4 తీవ్రతతో సంభవించిన భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. అఫ్ఘాన్ రాజధాని కాబూల్‌లోనూ ప్రకంపనలు వచ్చాయి. భారత్‌లోని ఉత్తరాది ప్రాంతాల్లోనూ స్వల్పంగా భూమి కంపించింది. ఆ దేశ రాజధాని దిల్లీ, జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లా, దక్షిణ పీర్ పంజాల్ ప్రాంతంలో ప్రకంపనలు వచ్చాయి. అఫ్ఘానిస్థాన్‌లో బుధవారం కూడా భూమి కంపించింది. 4.1 తీవ్రతతో ప్రకంపనలు సంభవించాయి. పాకిస్థాన్‌లోని క్వెట్టా నగరం, దాని పరిసర ప్రాంతాల్లో గతవారం 4.6 తీవ్రతతో భూకంపం వచ్చిన విషయం తెలిసిందే.

పపువా న్యూ గునియాలో ఎమర్జెన్సీ

పేట్రేగిన హింస

15 మంది మృతి

సైన్యం మోహరింపు

పోర్ట్ మోరెస్బీ: పపువా న్యూ గునియా రాజధాని పోర్ట్ మోరెస్బీ అట్టుడికిపోయింది. అల్లర్లు చెలరేగి హింస చోటుచేసుకుంది. దుకాణాలు లూటీకి గురయ్యాయి. కొన్ని దుకాణాలకు దుండగులు నిప్పుపెట్టారు. హింసలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో 14 రోజుల పాటు అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ ప్రధాని జేమ్స్ మరాపే గురువారం ఆదేశాలు జారీచేశారు. ఎమర్జెన్సీ కాలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వెయ్యికిపైగా బలగాలను మోహరించారు. కొందరు సైనికులు, పోలీసు అధికారులు, జైలు గార్డులు ఆందోళనబాట పట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన ఈ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. నిరసనలు మొదలైన గంటల వ్యవధిలో అల్లర్లు జరిగాయి. ఈ పరిస్థితులను అదుపు చేసేందుకు దేశ రాజధానిలో 14రోజుల ఎమెర్జెన్సీని ప్రకటించినట్లు ప్రధాని తెలిపారు. తమ వేతనాలను అకారణంగా కోత వేయడాన్ని నిరసిస్తూ భద్రతా దళాలు ఆందోళన బాట పట్టాయి. ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి, ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలిపింది. ఇది పొరపాటుగా జరిగిందని నచ్చచెప్పే ప్రయత్నం చేసింది. కానీ ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉన్న ప్రజలు కూడా మద్దతివ్వడంతో ఆందోళన పెద్దదైంది. వేతనాల సమస్యతో సంబంధమున్న పోలీసు కమిషనర్, వ్యక్తిగత, ఆర్థిక, ట్రజరీ శాఖాధిపతులను 14 రోజుల పాటు సస్పెండ్ చేసినట్లు ప్రధాని మరాపే వెల్లడించారు.

సీట్ల పరేషాన్

(మొదటిపేజీ తరువాయి)

ఆశీస్సులతో సర్పంచ్‌గా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అనంతరం తిరువూరు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి టీడీపీలోకి వెళ్లేందుకు దాదాపు సిద్ధమైంది. సారథితో పాటు ఎమ్మెల్యే రక్షణనిధి తన పదవికి రాజీనామా చేసి, టీడీపీలోకి వెళతారన్న ప్రచారం ఉంది. వైసీపీ విజయవాడ నగర అధ్యక్షులు బొప్పన భవకుమార్ అసంతృప్తిగా ఉన్నారు. ఈయన కూడా టీడీపీ తీర్థం పుచ్చుకుం టారని తెలిసింది. పార్థసారథికి అత్యంత సన్నిహితుడ్కైన పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పార్టీలో ఉంటారా?, లేదా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది.

క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్యేలు

తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి వివిధ ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు బుధవారం వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేశ్ సీటుపై జరిగింది. నరసరావుపేట లోక్‌సభ ఇన్‌చార్జి నియామకంపై ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలను క్యాంపు కార్యాలయానికి సీఎం పిలిపించుకున్నారు. నరసరావు పేట ఇన్‌ఛార్జ్ లావు కృష్ణదేవరాయలను మార్చవద్దని వారు సూచించినట్లు తెలిసింది. ఇదే ఎంపీ స్థానాన్ని బీసీ వర్గం నుంచి నాగార్జున యాదవ్‌ను రంగంలోకి దించాలని, కృష్ణదేవరాయలను గుంటూరు ఎంపీగా పంపాలని సీఎం ఆలోచిస్తున్నారు. ఇప్పటికే నరసరావుపేట నుంచే తాను పోటీ చేస్తా నని సిట్టింగ్ ఎంపీ లావు కృష్ణదేవరాయలు ప్రకటించిన విషయం విదితమే. అటు పల్నాడు జిల్లాలోని నియోజకవర్గాల సీట్లపైన ఆయా ఎమ్మెల్యేలతో సీఎం జగన్ చర్చించారు. ఎంపీ, ఎమ్మెల్యే సీట్ల వ్యవహారం పూర్తి స్థాయిలో కొలిక్కి వచ్చాకే మూడో విడత జాబితా విడుదలకు నిర్ణయించారు.

చంద్రబాబుతో భేటీ కానున్న పార్థసారథి?

పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శుక్రవారం టీడీపీ అధినేత చంద్రబాబుతో భేటీ కానున్నారని తెలిసింది. ఈ నెల 18న గుడివాడలో జరగనున్న చంద్రబాబు సభలో పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు పార్థసారథి ఆలోచిస్తున్నారు. ఇప్పటికే పార్థసారథితో వైసీపీ నేతలు చేసిన చర్చలు, బుజ్జగింపులు ఫలించలేదు. దీంతో సారథి పార్టీ మార్పుపై దాదాపు నిర్ణయించినట్లు సమాచారం. రాబోయే ఎన్నికల్లో ఆయన పెనమలూరు నుంచే పోటీ చేస్తారని వర్గీయులు చెబుతున్నారు. అదే జరిగితే ప్రస్తుత పెనమలూరు మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆయన చేరికను వ్యతిరేకిస్తారు ఇప్పటికే బోడే ప్రసాద్ వర్గం సమావేశం నిర్వహించి, పార్థసారథికి సీటు ఇస్తే వ్యతిరేకంగా పనిచేయాలని నిర్ణయించుకుంది. పార్థసారథిని నూజివీడు నుంచి పోటీ చేయించాలని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది. పార్థసార్థథి వైసీపీని వీడితే ఆయన స్థానంలో పెనమలూరు ఇన్‌ఛార్జ్‌గా మంత్రి జోగి రమేశ్‌ను నియమించే ఆలోచనలో అధిష్ఠానం ఉంది.

దేశానికే ఆదర్శం 'జగనన్న తోడు'

చిరు వ్యాపారుల ఖాతాల్లో రూ.431 కోట్లు జమ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని చిరువ్యాపారులకు ఆర్థిక సాయం అందిస్తున్న 'జగనన్న తోడు' పథకం దేశానికే ఆదర్శమని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఈ పథకం కింద ఎనిమిదో విడత నిధులను సీఎం గురువారం క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి విడుదల చేశారు. పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ 3,95,000 మందికి రూ.10 వేలు చొప్పున వడ్డీతో కలిపి రూ. 417.94 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. జగన్ మాట్లాడుతూ ' మానవత్వానికి మారుపేరుగా మన ప్రభుత్వం ఉంది. చిరు వ్యాపారులకు రూ.417.94 కోట్ల వడ్డీలేని రుణాలు ఇస్తున్నాం. నాలుగున్నరేళ్లలో ఈ పథకం ద్వారా చిరు వ్యాపారులు నాలుగు సార్లు లబ్ధిపొందారు. లబ్ధిదారుల్లో 87 శాతం మంది మహిళలే ఉన్నారు. జగనన్న తోడు ద్వారా 79.174 శాతం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు లబ్ధి జరిగింది. సామాజిక సాధికారతకు ఇది దోహదపడింది. జగనన్న తోడు పథకం మిగతా రాష్ట్రాలకు ఏపీ రోల్ మోడల్‌గా నిలిచింది. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇది సాధ్యమైంది. ప్రతి అడుగులోనూ పారదర్శకంగా పాలన. చేయి పట్టుకుని నడిపిస్తూ మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్నాం' అని అన్నారు. ప్రజలకు ఇంకా మంచి చేసే అవకాశం కలగేలా ఆశీర్వదించాలని కోరుతూ ప్రసంగాన్ని ముగించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి (పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ) బూడి ముత్యాలనాయుడు, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్, సెర్ప్ సీఈఓ ఇంతియాజ్, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదిన్, మెప్మా ఎండీ విజయలక్ష్మి, స్త్రీ నిధి ఎండీ నాంచారయ్య, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ ఎం.రవీంద్రబాబు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

పందెం కోళ్లు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

అంటోంది. కానీ పందేలపై నిషేధం విధించడం సబబు కాదని స్థానికుల భావనగా ఉంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో రహస్యంగా కోడిపందేలు జరుగుతున్నాయి. సాంప్రదాయానికి అద్దం పట్టే కోడి పందేలు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలంటూ స్థానిక ప్రజలే ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకొస్తున్నారు. ఒకవేళ పందేలకు అనుమతులిస్తే మాత్రం పందెం రాయుళ్లకు నిజంగా పెద్ద పండుగే... ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో రాజకీయ పార్టీలు ఢీ అంటే ఢీ అంటున్నాయి. 2024 ఎన్నికల సంవత్సరం కావడంతో సంక్రాంతి కోడిపందేల వ్యవహారంపై చూసి చూడనట్లుగా ఉండాలని రాజకీయ నాయకుల నుంచి పోలీసులపై ఒత్తిడి వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. బరులకు అనుమతుల కోసం గ్రామ, మండల స్థాయి అధికార పార్టీ నాయకులు... తమ ప్రజా ప్రతినిధులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తున్నారు.

రూ.కోట్లలో వ్యాపారం

పందేనికి ఎంపిక చేసిన పుంజును బట్టి సుమారు రూ.30 వేలు లేక రూ.50 వేల నుంచి రూ. లక్షల్లో డిమాండ్ ఉంటుంది. ఎంపిక చేసుకున్న పుంజులను వేలు ఖర్చుపెట్టి తుది పోరుకు సిద్ధం చేస్తున్నారు. పందెం రాయుళ్లు పుంజుల పౌష్టికాహారానికి భారీగా ఖర్చు చేస్తున్నారు. పందెం గెలిచేందుకు ప్రత్యేక వ్యాయామం, పౌష్టికాహారం అందిస్తూ సంక్రాంతి బరిలోకి దించబోతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 150 కి పైగా కోడిపుంజుల పెంపకం కేంద్రాలు ఉన్నట్లు సమాచారం. రూ.కోట్లలో కోడి పుంజుల వ్యాపారం జరుగుతుంది.

బహిరంగ వేలం పాటలు

కొల్లేరు లంక గ్రామాలలో ఇప్పటికే కోడిపందేలు, జూదాల కోసం గ్రామ కట్టుబాట్ల మధ్యన బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. వీటిలో వేలం పాడుకున్న వారి నిర్ణయమే శిరోధార్యంగా ఒప్పందాలు చేసుకున్నారు. గ్రామంలో అత్యధికంగా రూ.10 లక్షల వరకు వేలం పాటలు జరిగినట్లు తెలుస్తోంది.

ఆన్‌లైన్ లో కోడి పుంజులు రెడీ

దేశ, విదేశాల్లో నివసించే వారు స్వగ్రామంలో జరిగే కోడి పందేలపై ఆసక్తితో ఆన్‌లైన్‌లో పుంజులను కొనుగోలు చేసి పెంపకందారులకు అడ్వాన్స్‌లు కూడా చెల్లిస్తున్నట్లు తెలిసింది. పందెం పుంజుల పెంపకం, వాటిని బరిలో దింపేం దుకు చేసే సన్నద్ధతను వీడియో కాల్ లో చూసి సూచనలు చేయడం గమనార్హం. సాంప్రదాయం ముసుగులో కోడిపందేలు, పేకాట నిర్వహించడం పరిపాటిగా మారింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహించడం నేరమని కోర్టులు చెబుతున్నా జూద క్రీడ ఆగడం లేదు.

నాడి తెలిస్తేనే పందెం కడతారు

కోడిపందేలు అంటే ఆషామాషీగా డబ్బులు వెద జల్లడం కాదంటారు పందేల నిపుణులు. పందెం కాసేటప్పుడు కోడి నాడి తెలుసుకొని పందెంలో పాల్గొనాలంటారు. పుంజులను బరిలో దింపినప్పుడు క్షణాలలో ఆ పుంజుల సత్తా తెలిసిపోతుంటుంది. రంగు, రకం, సమయాన్ని బట్టి పందేలు కడతారు. ఏ జాతి పుంజు ఏ జాతి పుంజుతో తలపడితే ఆ సమయంలో ఎలా గెలవగలుగుతుందో అనేది కూడా నిపుణులకు తెలుస్తుంది. ప్రధానంగా దేగ, నెమలి, మైలా, కాకి, కోక్కిరాయి, సేతువ,పచ్చ కాకి, పెట్టమారు, పిచ్చుకవన్నె, తెల్ల నెమలి, నల్ల నెమలి అనేవి ప్రధానమైన రకాలు. వీటిలో పచ్చ కాకి, దేగ రకాలకు అధిక డిమాండ్ ఉంటుంది. ఈ కోళ్లలో రంగును బట్టి ఆయా రోజులలో రక్త ప్రసరణ జరుగుతుందని, అందువలన కాలానుగుణంగా పందేలు కాయాలంటారు నిపుణులు. పందేలు జరిగే రోజులు, రాశులను బట్టి 27 నక్షత్రాలుగా విభజిస్తారు. ఏ రాశుల్లో ఏ సమయాన ఏ జాతి కోడికి రక్త ప్రసరణ బాగా ఉండి పోరాటపటిమకు దోహదపడుతుందో ముందుగానే పసిగట్టి పందేలు కాస్తుంటారు. ఎంతో అనుభవం ఉంటేనే ఈ పందేల్లో నెగ్గకు రావచ్చునని నిపుణులు చెబుతున్నారు.

పందేలు...వాటి రకాలు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతంలో మూడు రకాల పందేలున్నప్పటికీ కత్తులు కట్టి పోట్లాడించే వాటికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. రెండవది డింకి పందెం. మూడవది ఆస్లీమ్ పందెం. కాళ్లకు కత్తులు కట్టి పోరాడేంచేదాన్ని కత్తి పందెం అంటారు. మిగిలిన రెండు పందాలు మనుషుల మల్ల యుద్ధాన్ని పోలి ఉంటాయి. డింకి పందెం గంటల్లో ముగిస్తే, ఆస్లిమ్ ఒక్కొక్కసారి రెండు రోజుల వరకు కొనసాగుతాయి. అయితే క్రికెట్ లో టీ20 మ్యాచ్‌కు క్రేజ్ పెరిగినట్లుగానే నిమిషాలలో ఫలితాలు వచ్చే కత్తులు కట్టే పందేలపైనే ఇప్పుడు మోజు ఎక్కువైంది. చిన్న పెద్ద అనే తేడా లేకుండా వెంటనే ఫలితాలు వచ్చే పందేల పైనే పందం రాయుళ్లు, ప్రేక్షకులు మొగ్గుచూపుతున్నారు. రాబోయే సంక్రాంతి మూడు రోజులు అందరూ అనుకునే విధంగా తప్పనిసరిగా పందేలు నిర్వహిస్తారని, ప్రభుత్వం కూడా ఈ మూడు రోజులు చూసి చూడనట్లుగా అనధికారికంగా అనుమతిలిస్తుందని పందెం రాయళ్లు , నిర్వాహకులు చెబుతున్నారు.

వివాదాల గోపురం

(మొదటిపేజీ తరువాయి)

హిందుత్వను, సనాతన ధర్మాన్ని నిత్యం అవమానిస్తాయని బీజేపీ ఆక్షేపించింది. రామజన్మభూమిని తొలినుంచీ కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని బీజేపీ ఎంపీ హర్‌నాథ్ సింగ్ యాదవ్ ఆరోపించారు. రామాలయ నిర్మాణానికి అవరోధాలు సృష్టించేందుకు కాంగ్రెస్ అన్ని అవకాశాలను ఉపయోగించుకున్నదని మండిపడ్డారు. హిందుత్వకు కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకమేనని బీజేపీ కర్నాటక రాష్ట్ర అధ్యక్షుడు సీటీ రవి అన్నారు. గతంలో సర్దార్ వల్లభాయ్ పటేల్, బాబూ రాజేంద్ర ప్రసాద్ సోమనాథ్ ఆలయాన్ని పునర్నిర్మిస్తే అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆలయాన్ని సందర్శించలేదని గుర్తు చేశారు. అయితే అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి హాజరు కారాదని కాంగ్రెస్ అగ్ర నేతలు తీసుకున్న నిర్ణయాన్ని కర్నాటక సీఎం సిద్ధరామయ్య గురువారం సమర్థించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని బీజేపీ రాజకీయ కార్యక్రమంగా మార్చివేసిందని ఆరోపించారు. రామమందిరాన్ని రాజకీయాల్లోకి లాగడాన్ని నిరసిస్తూ నలుగురు శంకరాచార్యులు ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నారని తెలిపారు. ఇదిలాఉండగా, రామాలయ ప్రారంభోత్సవానికి తమకు ఆహ్వానం అందలేదని కాంగ్రెస్ పేర్కొందని, ప్రస్తుతం వారికి ఆహ్వానం అందడంతో దాన్ని వారు అంగీకరించడం లేదని బీజేపీ చెబుతోంది.

రామ మందిర నిర్మాణం అసంపూర్తి

అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి నలుగురు శంకరాచార్యులు హాజరుకావడం లేదని ఉత్తరాఖండ్‌లోని జ్యోతిర్ మఠం శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతి తెలిపారు. ఆలయ నిర్మాణం అసంపూర్తిగా ఉందని, శాస్త్రాలకు వ్యతిరేకంగా ప్రతిష్ఠాపన కార్యక్రమం జరుగుతున్నదని ఆరోపించారు. సనాతన ధర్మం నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున అతి ముఖ్యమైన హిందూ మత గురువులు ఈ వేడుకకు హాజరుకావడం లేదని హరిద్వార్‌లో మీడియాతో అన్నారు. ఆలయ నిర్మాణం పూర్తి చేయకుండా రాముడి విగ్రహాలను ప్రతిష్ఠించడం హిందూ మతానికి విరుద్ధమని విమర్శించారు. ప్రతిష్ఠాపనకు అంత తొందర అవసరం లేదన్నారు. రామమందిర నిర్మాణం పూర్తయిన తర్వాత విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఆలయ ట్రస్టు ప్రకారం... రామాలయంలో మొదటి అంతస్తు, గర్భగుడి మాత్రమే సిద్ధంగా ఉంది. వచ్చే రెండేళ్లలో ఆలయాన్ని పూర్తి స్థాయిలో నిర్మిస్తామని ట్రస్టు తెలిపింది.

ప్రజలతో కలిసిపోయే నేత కూనంనేని

- ఐజేయూ జాతీయాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి
- 'అసెంబ్లీలో ఒకే ఒక్కడు' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర, హైదరాబాద్: ప్రజలతో కలివిడిగా ఉంటూ... వారితో ఉండాలని కోరుకునే నేత కూనంనేని సాంబశివరావని ఐజేయూ జాతీయాధ్యక్షుడు, ప్రజాపక్షం సంపాదకులు కే శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావుపై సీనియర్ జర్నలిస్టు షేక్ హసీనా రచించిన 'అసెంబ్లీలో ఒకే ఒక్కడు' పుస్తకావిష్కరణ సభ హైదరాబాద్ మగ్దూం భవన్‌లో గురువారం జరిగింది. సీపీఐ మల్కాజిగిరి- మేడ్చెల్ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఈ పుస్తకాన్ని శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సభకు కూనంనేనితో పాటు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సీఆర్ ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ డీ కృష్ణ కుమారి, తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేంపావని తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సాంబశివరావు మంచి ఎడిటర్ అని, మంచి కమ్యూనికేటర్ అన్నారు. ప్రజలతోనే జీవించాలని, కలివిడి గా ఉండాలన్న భావన ఒక్కో వ్యక్తికి ఒక రకంగా ఉంటుందని, కూనంనేని సాంబశివరావులో ఎక్కువగా ఉంటుందన్నారు. దేశానికి కమ్యూనిస్టుల అవసరం ఎంతో ఉందని బీజేపీ మినహా అందరూ భావిస్తున్నారన్నారు. ప్రధాని మోదీయే తమకు శత్రువు కమ్యూనిస్టులేనని చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతమున్న బీజేపీ... అసలు బీజేపీ కాదనే భావన ప్రజల్లో బాగా వచ్చిందని, బీజేపీ భావాలకు కట్టుబడని వ్యక్తులే ఆ పార్టీలో ఎక్కువగా ఉన్నారని వివరించారు. నాయకులు చెబుతున్న అంశాలు, వారి మాటలు కింది స్థాయిలోని ప్రజలకు, చదువు రాని వారికి కూడా చేరాలని, అప్పుడే ఆ సందేశాలు ప్రజలకు చేరుతాయన్నారు. 'అసెంబ్లీలో ఒకే ఒక్కడు' పుస్తక రచయిత షేక్ హసీనాను, పుస్తకాన్ని తీసుకొచ్చేందుకు ప్రోత్సహించి, సహకరించిన డి.కృష్ణ కుమారిని శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. ఒక వ్యక్తి గురించి పుస్తకాన్ని రాసే సమయంలో రచయితకు స్వేచ్ఛ ఉంటుందని, అదే సమయంలో ఆ వ్యక్తికి సంబంధించి తప్పులు దొర్లితే వాటిని సవరించే హక్కు కూడా ఆ వ్యక్తికి ఉంటుందని వివరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కమ్యూనిస్టుల చరిత్ర, పార్టీ కోసం త్యాగాలు చేసిన వ్యక్తుల పై పుస్తకాలు రాయాల్సిన అవసరం ఉన్నదన్నారు. పుస్తకాలు రాసే క్రమంలో కంటెంట్, అంశాల వారీగా ప్రాధాన్యత పాటించాలని సూచించారు. షేక్ హసీనాను ఆయన అభినందించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల గొంతుకే కమ్యూనిస్టుల గొంతు అన్నారు. కమ్యూనిస్టు పార్టీపై తీవ్ర ఒత్తిడి ఉంటుందని, అనేక సమస్యలను శాసనసభలో ప్రస్తావించాల్సి ఉంటుందన్నారు. ఇందులో కూనంనేని సాంబశివరావు సఫలీకృతం అవుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. సీఆర్ ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ కృష్ణ కుమారి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మరుగునపడిన ప్రముఖ మహిళల చరిత్ర వివరిస్తూ 'రెడ్ స్వాన్ పబ్లిషర్స్ వేదిక' ద్వారా ప్రతి మూడు నెలలకు ఒకసారి పుస్తకాన్ని తీసుకొస్తామని తెలిపారు.

డీఎస్సీ పోరాటానికి మద్దతు ఇవ్వాలి

నాదెండ్ల మనోహర్‌కు ఏపీ నిరుద్యోగుల జేఏసీ వినతి

విశాలాంధ్ర-విజయవాడ: డీఎస్సీ కోసం చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని జనసేన ప్రధాన కార్యదర్శి నాదెండ్ల మనోహర్‌ను ఏపీ నిరుద్యోగుల జేఏసీ కో-కన్వీనర్ ద్రవిడ సురేశ్ కోరారు. నిరుద్యోగులకు భరోసా ఇచ్చే మేనిఫెస్టో రూపొందించాలని సూచించారు. అధికారంలోకి రాగానే టీచర్ల పోస్టులు భర్తీ చేస్తామని, మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి జగన్ నిలబెట్టుకోలేకపోయారని, మెగా డీఎస్సీ కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ గురువారం విజయవాడలోని నోవోటల్‌లో మనోహర్‌ను కలిసి వినతి పత్రాన్ని సురేశ్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, వీరు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారని చెప్పారు. ఖాళీగా ఉన్న రెండు లక్షల 30వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అధికారంలోకి రాక ముందు జగన్ హామీనిచ్చారని, అందుకోసం ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పారని, ఇప్పటికైనా నిరుద్యోగులకు న్యాయం చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. జనసేన మేనిఫెస్టోలో జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, పరీక్షల నిర్వహణపై స్పష్టత ఇవ్వాలని సూచించారు. పదవీ విరమణలతో ఖాళీ అయ్యే పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఈ అంశాలను జనసేన మేనిఫెస్టోలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ జేఏసీ తరుపున నాదెండ్ల మనోహర్‌ను కోరినట్లు తెలిపారు. పక్కా ప్రణాళికతో జాబ్ క్యాలెండర్ ఇస్తామని, మెగా డీఎస్సీ కోసం నిరుద్యోగుల పోరాటానికి మద్దతిస్తామని నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారని సురేశ్ వెల్లడించారు.

వైసీపీ సర్కార్‌కు భారీ షాక్

(మొదటిపేజీ తరువాయి)

తెచ్చారన్న విమర్శలున్నాయి. ఈ మేరకు విద్యా హక్కు చట్టం నియామాలు-2010కి రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేసింది. టీచర్లకు బోధనేతర పనులను అప్పగించవద్దని, కేవలం విద్యాపరమైన అంశాలకే పరిమితం చేయాలని తెలిపింది. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 27 ఆధారంగా జనాభా గణన, విపత్తు సహాయ విధులు, స్థానిక సంస్థలు, రాష్ట్ర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల విధులకు టీచర్లను వినియోగించకూడదని, సెక్షన్ 27లోని నిబంధనలకు అనుగుణంగా బోధనేతర పనులు అప్పగించకూడదన్న అంశాన్ని బలోపేతం చేసేందుకు సవరణలు తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. తాజాగా సీఈవో ఆదేశాలు ప్రభుత్వానికి మింగుడు పడటం లేదు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై టీచర్లు వ్యతిరేకంగా ఉన్నారు. వారికి పీఆర్సీ, డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, తుదకు వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని వాపోతున్నారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు అనేక ఉద్యమాలు నిర్వహించాయి. ప్రభుత్వం వెనక్కి తగ్గకుంటే రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా తీర్పునిస్తామని హెచ్చరించాయి. దాంతోపాటు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదు. సీపీఎస్ రద్దు చేయకుండా దాని స్థానంలో గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) తీసుకువచ్చింది. దీనిపై టీచర్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా జరిగిన సమీక్షలో ఎన్నికల విధులకు సచివాలయ సిబ్బంది సరిపోబోరని సీఈసీ భేటీలో చర్చించారు. టీచర్లనూ ఎన్నికల విధుల్లోకి తీసుకోవాలని సీఈసీ సూచించింది. శుక్రవారం ఉదయం 11 గంటల్లోగా టీచర్లు, సిబ్బంది వివరాలను ఇవ్వాలని డీఈవోలను ఆదేశించింది. దీంతో సీఎస్‌ఈ ఆదేశాల మేరకు టీచర్లు, సిబ్బంది వివరాల సేకరణలో డీఈవోలు నిమగ్నమయ్యారు. రాబోయే ఎన్నికల్లో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో పాటు టీచర్లు, సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

వైసీపీ ఇన్‌చార్జిల మూడో జాబితా విడుదల

(మొదటిపేజీ తరువాయి)

జాబితా వివరాలను క్యాంపు కార్యాలయంలో గురువారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విడుదల చేశారు. మొత్తం 21 మందితో ఇన్‌చార్జిలను నియమించారు. ఇందులో 6 ఎంపీ స్థానాలు, 15 అసెంబ్లీ స్థానాలున్నాయి. జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేశారు.

ఎంపీ అభ్యర్థులు

1. శ్రీకాకుళం (ఎంపీ) : పేరాడ తిలక్
2. విశాఖపట్నం (ఎంపీ) : బొత్స ఝాన్సీ
3. ఏలూరు (ఎంపీ) : కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్
4. విజయవాడ (ఎంపీ) : కేశినేని శ్రీనివాస్(నాని)
5. కర్నూలు (ఎంపీ) : గుమ్మనూరి జయరామ్
6. తిరుపతి (ఎంపీ) ఎస్సీ : కోనేటి ఆదిమూలం

అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు:

7. ఇచ్ఛాపురం : పిరియ విజయ 8. టెక్కలి : దువ్వాడ శ్రీనివాస్
9. చింతలపూడి (ఎస్సీ) : కంభం విజయరాజు
10. రాయదుర్గం : మెట్టు గోవిందరెడ్డి 11. దర్శి : భూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
12. పూతలపట్టు (ఎస్సీ) : డాక్టర్ ఎం.సునీల్ కుమార్
13. చిత్తూరు : విజయానందరెడ్డి
14. మదనపల్లి : నిస్సార్ అహ్మద్
15. రాజంపేట : ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
16. ఆలూరు : బూసినే విరుపాక్షి
17. కోడుమూరు (ఎస్సీ) : డాక్టర్ సతీశ్
18. గూడూరు (ఎస్సీ) : మేరుగ మురళీ
19. సత్యవేడు (ఎస్సీ) : మద్దెల గురుమూర్తి
20. పెనమలూరు : జోగి రమేశ్ 21. పెడన : ఉప్పాల రాము

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

ఆవుల శేఖర్ డిమాండ్

విశాలాంధ్ర - నంద్యాల: పేదవాడు ఆత్మగౌరవంగా బ్రతకాలంటే ఖాళీగా ఉన్న లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం చిన్నదేవలాపురం గ్రామంలో దాదాపు 26 కుటుంబాల వ్యవసాయ కూలీలు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నూతన శాఖ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆవుల శేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో కష్టజీవుల సమస్యలపై ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కృషి చేస్తుందన్నారు. పేదలకు సంక్షేమ కార్యక్రమాల అమలలో ఉన్న సవాలక్ష నిబంధనలను తొలగించి, అర్హులందరికీ అందించాలన్నారు. గ్రామ సమస్యలతో పాటు సాంఘిక ఆర్థిక రాజకీయ అంశాలపై పేద ప్రజలు ముందుకు వచ్చి పోరాటాలు కొనసాగించాలని శేఖర్ పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఒక కుటుంబానికి 50 రోజులు పని దినాలు కేటాయించడంలో అధికారులు విఫలం చెందారని విమర్శించారు. అధికార పార్టీకి చెందిన వారు వ్యవసాయ కూలీలకు పనులు కల్పించకుండా యంత్రాలతో పనిచేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె రాధాకృష్ణ, సుబ్బరాయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ప్రతాపు, బలవద్దిరాజు, గోస్పాడు లక్ష్మీ దేవమ్మ, కొత్తపల్లి వెంకట శివుడు, హరినాథ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు

- సంక్రాంతి తర్వాత మలివిడత ఉద్యమం
- విభజన హామీల సాధన సమితి నేతల ప్రకటన

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించుకోవడానికి మలి విడత ఉద్యమం చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నాయకులు ప్రకటించారు. కలిసొచ్చే రాజకీయ పక్షాలు, విద్యార్థి, యువజన సంఘాలతో సంక్రాంతి పండుగ అనంతరం భవిష్యత్తు కార్యచరణ చేపట్టబోతున్నామని వారు తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సమితి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. దీనికి ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి కృష్ణా జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలుగా ద్రోహం చేసిందన్నారు. ప్రత్యేకహోదా, పోలవరం, రాజధాని నిర్మాణం వంటి అనేక అంశాలను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీలు విఫలమయ్యాయన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం త్వరలో భవిష్యత్తు కార్యాచరణ చేడతామని... ఇందుకు కలిసి వచ్చే పక్షాలను, ప్రజలను, విద్యార్థి, యువజన సంఘాలను కలుపుకుని పోరాటం చేస్తామన్నారు. సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రం పరిస్థితి దారుణంగా ఉందన్నారు. యువత ఉపాధి కోసం వలసలు పోతున్నారని... కేంద్రం చేస్తున్న అన్యాయంపై పోరాడే దమ్మున్న వారు కావాలన్నారు. 25 మంది ఎంపీలు ఇస్తే కేంద్రం మెడలు వంచి హెూదా తెస్తామని చెప్పిన జగన్... కేంద్రం వద్ద మోకరిల్లారని విమర్శించారు. అధికారంలోకి రాగానే స్వార్థరాజకీయ ప్రయోజనాలు కోసం విభజన హామీలను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమతో కలిసి రాష్ట్ర హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మరో వారంలో మలి ఉద్యమంలో భాగంగా నిరాహారదీక్షలతో పాటు అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి పండుగ తరువాత తేదీలు ప్రకటిస్తామన్నారు. జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 10 సంవత్సరాల్లో రాష్ట్రంలో అభివృద్ధిలో కాదు అప్పుల్లో నెంబర్ వన్ అయిందన్నారు. అన్ని పార్టీలు మేనిఫెస్టోలో ప్రత్యేక హెూదా అంశాన్ని పెట్టారు కాని సాధించటంలో మాత్రం విఫలం అయ్యారన్నారు. టీడీపీ, వైసీపీ కలిసి హెూదా విభజన హామీల కోసం పోరాడి ఉంటే ఎప్పుడో హెూదా వచ్చేదని చెప్పారు. ప్రత్యేక హెూదా ముగిసిన అధ్యాయం కాదని... కలిసి పోరాడితే సాధిస్తాం అని అన్నారు. సీపీఎం నాయకుడు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ రాష్ట్ర హక్కుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అధికార, ప్రతిపక్ష పార్టీలు విఫలమయ్యాయన్నారు. వైసీపీ రాజకీయ ప్రయోజనాలకోసం కేంద్రానికి తొత్తుగా మారిందన్నారు. కేంద్రాన్ని డిమాండ్ చేసే సందర్భాలు అనేకసార్లు వచ్చినప్పటికీ వైసీపీ వినియోగించుకోలేదన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీతో కుమ్మక్కవ్వడానికి రాష్ట్ర పార్టీలు పోటీలు పడుతున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుడు నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ... అనాడు కాంగ్రెస్ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇస్తే... దాన్ని బీజేపీ పక్కనబెట్టిందన్నారు. అమలు చేయలేదన్నారు. తిరుపతిలో వెంకన్న సాక్షిగా మోడీ హామీ ఇచ్చారు, పదేళ్లు గడిచినా అమలు ప్రాంతీయ పార్టీలతో హక్కులు సాధించలేరని... ఒక్క కాంగ్రెస్ తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, సీపీఐ నగర కార్యిదర్శివర్గ సభ్యులు కొట్టు రమణ, నవరంగ్ పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం, పోతిన వెంకట రామారావు, ఎమ్‌సీపీఐ (యునైటెడ్) ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె ఖాదర్ భాషి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ వ్యతిరేకశక్తులను కూడగడతాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర -ఏలూరు: వచ్చే ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేక పార్టీలన్నింటినీ కూడగట్టి ముందుకు సాగుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీకి వైసీపీ, టీడీపీ, జనసేన ఊడిగం చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. ఏలూరులో నిర్వహించిన సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై గురువారం స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండురోజుల రాష్ట్ర కమిటీ సమావేశాలు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగాయన్నారు. ప్రజాసమస్యలు, రాజకీయ పరిస్థితులపై సమీక్షించి నిర్ణయాలు తీసుకున్నామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను మోదీ ప్రభుత్వం జిందాల్‌కు అప్పగించిందన్నారు. కార్మికులు పెద్దఎత్తున పోరాడుతూ కార్పొరేటర్లను అడ్డుకుంటూ వచ్చారన్నారు. బీజేపీకి జగన్ మద్దతు పలుకుతూ పోర్టులను అదానీకి అప్పగిస్తున్నారన్నారు. అంగన్‌వాడీలు రోడ్డునపడి 31రోజులు గడుస్తున్నా సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలను ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించి అంగన్‌వాడీలంతా సంక్రాంతి పండుగ జరుపుకునేలా చూడాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగిన ఫలితం అనుభవించాల్సి ఉంటుందన్నారు. వైసీపీకి చెందిన అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారన్నారు. వారిని ఆపుతుంటే ఎదురు తిరుగుతున్న పరిస్థితి నెలకొందని చెప్పారు. ఆలస్యం చేసే కొద్దీ ప్రత్యర్థులను పెంచుకుంటారన్నారు. జీతాలు పెంపు అడుగుతున్నారని, దానిపై స్పష్టత ఇవ్వడం లేదన్నారు. లక్షమంది అంగన్‌వాడీ ఉద్యోగులు ఉన్నారని, ఒక్క ఉద్యోగిని తొలగించినా తీవ్ర పరిణామాలు తప్పవన్నారు. బెదిరింపులు, ఆషామాషీ వ్యవహారాలు మానుకోవాలన్నారు. అవసరమైతే అన్ని రాజకీయ పార్టీలు కలిసి రాష్ట్ర బంద్‌తో సహా అన్ని చేస్తామన్నారు. యేటా జనవరిలో జ్యాబ్ క్యాలెండర్ అంటూ ప్రభుత్వం చెప్పిందన్నారు. పదవీ కాలం పూర్తవుతున్నా ఉద్యోగాల భర్తీ లేదన్నారు. మెగా డీఎస్సీ కోసం ఐదులక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఆందోళన చేస్తే పోలీసులతో దౌర్జన్యం చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో 40 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. నాడు..నేడుతో తరగతి గదులు పెట్టి ఏమీ ఉపయోగం అన్నారు. ఏజన్సీలో స్పెషల్ డీఎస్సీ వేయడం లేదన్నారు. వెంటనే టీచర్‌పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యాశాఖ జాబ్‌మేళా జయప్రదం

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం నిర్వహించిన జాబ్ మేళాలో 74 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖలోని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్‌లో డిప్లొమా ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్‌లో (2022, 2023) ఉత్తీర్ణుల కోసం జాబ్ మేళాను నిర్వహించగా... 74 మంది విద్యార్థులు సుజ్లాన్ గ్లోబల్‌లో ఉద్యోగావకాశాలు దక్కించుకున్నారని తెలిపారు. ఎలక్ట్రికల్ నుండి 28, మెకానికల్ ఇంజనీరింగ్ నుండి 46 మంది డిప్లొమా ఇంజినీర్ ట్రెనీ స్థానాలకు సంవత్సరానికి రూ.2 లక్షల జీతంతో ఎంపికయ్యారని ఆమె పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఎనిమిది రాష్ట్రాల్లో పాన్ ఇండియా స్థాయిలో ఆపరేషనల్ మెయింటెనెన్స్ సర్వీసెస్‌లో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు మాత్రమే కాకుండా డిప్లొమా గ్రాడ్యుయేట్ చేసిన వారి కోసం కూడా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లను నిర్వహించడానికి కూడా విభిన్న కంపెనీలతో సాంకేతిక విద్యా శాఖ అవగాహన కుదుర్చుకుంటుందని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలను సృష్టించే వాతావరణాన్ని పెంపొందించి, పరిశ్రమలతో చురుగ్గా అనుసంధానం అయ్యేందుకు కట్టుబడి ఉన్నామని నాగరాణి వివరించారు.

ఊరు వెళ్లేందుకు రక్షణ కల్పించండి

హైకోర్టును ఆశ్రయించిన ఎంపీ రఘురామకృష్ణరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సంక్రాంతి పండుగకు తమ ఊరు వెళ్లేందుకు రక్షణ కల్పించాలని కోరుతూ నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే తనపై 11 కేసులు ఉన్నాయని, మరో కేసు కూడా పెట్టవచ్చని తెలిపారు. రఘురామకృష్ణరాజు తరపున న్యాయవాది ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపించారు. గతంలో రఘురామరాజును సీఐడీ అధికారులు అరెస్టు చేసి చిత్రహింసలకు గురి చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు మరలా తప్పుడు కేసులు పెట్టి ఆయనననఖ అరెస్టు చేసే అవకాశం లేకపోలేదన్నారు. పోలీసులు నిబంధనలు పాటించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అర్నేశ్ కుమార్ కేసులో 41ఏ నిబంధనలను పాటించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను న్యాయవాది ప్రస్తావించారు. రఘురామకృష్ణరాజుపై నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. రఘురామకృష్ణరాజు పిటిషన్‌కు విచారణ అర్హతలేదని, కేసు నమోదైె, అది ఏడేళ్ల లోపు శిక్ష ఉన్న సెక్షన్లు అయితేనే 41ఏ నిబంధనలు వర్తిసాయని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. రఘురామకృష్ణరాజుపై ప్రభుత్వం తాజాగా ఎలాంటి కేసులు పెట్టలేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు శుక్రవారం తీర్పు ఇస్తామని పేర్కొంది.

సచివాలయ ఉద్యోగుల సమస్యలపై

చర్చలు సఫలం

ఓబులేసు

విశాలాంధ్ర-విజయవాడ: గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ (ఏఐటీయూసీ అనుబంధం) యూనియన్ ప్రతినిధులు గురువారం ఎనర్జీ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో జరిపిన చర్చలు ఫలించాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యూనియన్ గౌరవాధ్యక్షులు జి.ఓబులేసు తెలిపారు. ఎనర్జీ అసిస్టెంట్లు రాష్ట్రంలో 7,200 మంది సచివాలయ వ్యవస్థ కేంద్రంగా పని చేస్తున్నారని, వీరికి సరైన సర్వీసు రూల్స్, సెలవులు, అలవెన్సులు లేవని చెప్పారు. రెండు సంవత్సరాల సర్వీసు (సచివాలయాలలో) దాటిన వారందరికి ప్రొబిషన్ ప్రకటించాల్సి ఉండగా ఇంకా కొంతమంది మిగిలే ఉన్నారని తెలిపారు. ప్రమాదాల్లో చనిపోయిన వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారం కొందరికి చెల్లించలేదన్నారు. ఈ అంశాలపై అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చారని ఆయన వివరించారు. వెంటనే ఎస్ఆర్ ఓపెన్ చేస్తామని, మెడికల్, కన్వేన్స్ అలవెన్సులు ఇవ్వడానికి వెంటనే ఆదేశాలు ఇస్తామని తెలిపినట్లు ఓబులేసు చెప్పారు. వారంలోగా విద్యుత్ రంగంలో పనిచేసే ఇతర ఉద్యోగులకు ఇచ్చే అన్ని రకాల సెలవులు ఇస్తామని, ప్రొబిషన్ డిక్లేర్ చేయని వారందరికీ వెంటనే చేస్తామని, ప్రస్తుతం ఉన్న పాలసీ ప్రకారం ప్రమాదంలో చనిపోయిన వారందరికీ నష్టపరిహారం చెల్లిస్తామని పదోన్నతులు, బదిలీల సౌకర్యం కూడా కలగచేస్తామని నిర్దిష్టమైన హామీ ఇచ్చారని, రెండు రోజుల్లో మినిట్స్ కూడా ఇస్తామని చెప్పారన్నారు. ఈ చర్చల్లో అధికారుల తరపున విజయానంద్‌తో పాటు ఏపీడీసీఎల్, సీపీడీసీఎల్, సీపీఎండీ, సంతోష్, జేఎండీ డి.మల్లారెడ్డి, విజిలెన్స్ డైరెక్టరు ఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వీతేజ్ పాల్గొన్నారు. యూనియన్‌ల తరపున జి.ఓబులేసుతో పాటు అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు, ఎనర్జీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంజునాథ్, కోశాధికారి సుధీర్‌బాబు, కృష్ణాజిల్లా నాయకులు హేమ కుమార్, ఏపీ ఎలక్ట్రిసిటీ రాష్ట్ర కార్యదర్శి గురుబ్రహ్మ పాల్గొన్నారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన విజయానంద్‌కు ఓబులేసు, బొప్పరాజు కృతజ్ఞతలు తెలిపారు.

మా అప్పు రూ.1.56 లక్షల కోట్లే !

- చంద్రబాబుది దుష్ప్రచారం
- బుగ్గన రాజేంద్రనాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధికారంలోకి వచ్చాక రూ.13లక్షల కోట్లు అప్పులు చేసినట్లు టీడీపీ అధినేత చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మండిపడ్డారు. చంద్రబాబు ఏ ఆధారాలతో ఈ లెక్కలు చెబుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో గురువారం మధ్యాహ్నం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయంటూ తీవ్రంగా ఖండించారు. వాస్తవానికి టీడీపీ హయాంతో పోలిస్తే తమ ప్రభుత్వంలో చేసిన అప్పులు తక్కువేనని మంత్రి స్పష్టం చేశారు. ఆర్థిక మంత్రిగా పని చేసిన యనమల, చంద్రబాబు ఇష్టారీతిగా అప్పుల లెక్కలు చెబుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ఒకరు రూ. 7 లక్షల కోట్లంటే మరొకరు రూ. 10 లక్షల కోట్లని... మరోసారి రూ.13 లక్షల కోట్లని కూడా ప్రచారం చేయడం వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. కోవిడ్ వల్ల రాష్ట్ర ఆర్థికపరిస్థితి దెబ్బతిన్న విషయం ప్రతిపక్షాలకు తెలియనిది కాదన్నారు. అప్పులపై ప్రతిపక్షాలు చేస్తున్నది ముమ్మాటికి తప్పుడు ప్రచారమేనన్నారు.

కాగ్, ఆర్బీఐ, ఆర్థిక శాఖ, బ్యాంకులకు తెలియకుండా అప్పులు చేయడం సాధ్యమా?

కాగ్,ఆర్బీఐ, ఆర్థికశాఖ, బ్యాంకులకు తెలియకుండా అప్పులు చేయడం సాధ్యమవుతుందా? అని ఆయన ప్రశ్నించారు. ఏ ఆధారంతో ఏపీ ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయో ప్రజలకు చెప్పాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మొత్తం అప్పు రూ.4,28,715 అని మంత్రి స్పష్టం చేశారు. అందులో రూ.2,71,797 కోట్లు టీడీపీ ప్రభుత్వంలో చేసిన అప్పు అని, వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పు 1,56,925 కోట్లేనని ఆయన వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో వార్షిక అప్పు 22 శాతం పెరిగిందని, తమ ప్రభుత్వంలో 12 శాతం మాత్రమే అప్పులు పెరిగాయన్నారు.

అలాగే టీడీపీ పరిపాలనలో రెవెన్యూ రాబడి 6 శాతం పెరగ్గా, తమ ప్రభుత్వంలో 16.7 శాతం రెవెన్యూ రాబడి పెరిగిందన్నారు. ఈ గణాంకాలు చూస్తే సంపద సృష్టించేదెవరో రాష్ట్ర ప్రజలకే అర్థమవుతుంద న్నారు. కేంద్రం నుండి మన వాటా నిధులు క్రమం తప్పకుండా సాధించుకుంటున్నామన్నారు. ఆర్బీఐ విడుదల చేసిన డాక్యుమెంట్ లో 15 ఏళ్ల డేటా ఉంటుందని మంత్రి బుగ్గన స్పష్టం చేశారు.

2న విశాఖలో భారత్-ఇంగ్లండ్ టెస్టు

ఏసీయే కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

విశాలాంధ్ర - పీఎంపాలెం (విశాఖ): భారత్-ఇంగ్లండ్ క్రికెట్ జట్ల మధ్య ఐదుమ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా విశాఖలో ఫిబ్రవరి 2 నుంచి 6వ తేదీవరకు రెండవ టెస్టు మ్యాచ్ జరగనుంది. డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఆర్. గోపినాథ్‌రెడ్డి వెల్లడించారు. స్టేడియంలో గురువారం మ్యాచ్ తొలి నిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, సిటీ పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, డీసీపీ శ్రీనివాసరావు, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్, ఏసీఏ సీఈవో డా.ఎంవీశివారెడ్డి, సీఎఫ్‌వో నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ మ్యాచ్ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న క్లబ్ ప్లేయర్స్‌కు కేవలం రూ. 250లకు ఐదు రోజుల పాటు మ్యాచ్‌ను తిలకించేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా రెండు వేల మంది విద్యార్థులకు ఉచితంగా మ్యాచ్ చూసే అవకాశం కల్పిస్తామన్నారు. అయితే విద్యార్థులు తమ యాజమాన్యాలు జారీ చేసిన ఐడీ కార్డులను తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుందని తెలిపారు. కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ మ్యాచ్ కోసం అవసరమైతే అదనంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మ్యాచ్ జరిగే ఐదు రోజుల పాటు స్టేడియంతో పాటు చుట్టుపక్కల నిరంతరం విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ క్రీడాకారులకు కట్టుదిట్ట భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. స్టేడియం చుట్టు పక్కల, పార్కింగ్ ఏరియాల్లో ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

టిక్కెట్ ధరలు ఇలా...

టెస్టు మ్యాచ్ టికెట్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విక్రయించనున్నారు. ఒక రోజు మ్యాచ్ కోసం రూ.100, రూ. 200, రూ.300, రూ.500 విలువ చేసే టికెట్లు, అదేవిధంగా 5 రోజులకు కలిపి రూ. 400, రూ. 800, రూ.1000, రూ. 1500 విలువ చేసే టికెట్లు అందుబాటులో ఉంటాయి. పేటీఎం యాప్ ద్వారా లేదా insider.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లను కొనుగోలు చేయొచ్చు. ఈ నెల 15వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో, 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఆఫ్‌లైన్ ద్వారా డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియం, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో టికెట్లు విక్రయించనున్నారు. అదేవిధంగా పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో 6వ తేదీ వరకు కూడా టికెట్లు కొనుగోలు చేసేందుకు ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంటాయి.

వైసీపీలోకి మాజీ ఎమ్మెల్యే స్వామిదాస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామి దాస్, ఆయన సతీమణి సుధారాణి గురువారం వైసీపీలో చేరారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వారికి పార్టీ కండువాలనుకప్పి వైసీపీలోకి ఆహ్వానించారు. 1994, 1999లో రెండు సార్లు తిరువూరు నియోజకవర్గం నుంచి టీడీపీ తరుపున స్వామిదాస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రికి ఘన నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో గురువారం మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లావు తాంతియాకుమారి, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి, సమాజానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పీవై కిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీఎస్ జవహర్ రెడ్డికి ఏపీ జేఏసీ అమరావతి వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మున్సిపల్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర మునిసిపల్ ఉద్యోగుల సేవా సంఘం డిమాండ్ చేసింది. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికయిన రాష్ట్ర మునిసిపల్ ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షులు ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, కార్యవర్గ సభ్యులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డిని గురువారం కలిసి ఉద్యోగుల ప్రధాన సమస్యలపై 11 అంశాలతో వినతి పత్రం అందజేశారు. అన్ని కార్పొరేషన్లకు సర్వీస్ రూల్స్ తయారు చేసి అమలు చేయాలని, కొత్తగా ఏర్పాటయిన మున్సిపల్ కార్పొరేషన్లు, ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిపి జనాభా సంఖ్యకు అనుగుణంగా కేడర్ స్ట్రెంగ్త్ మంజూరు చేయాలన్నారు. అసమగ్రంగా ఉన్న ఆప్కాస్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల వివిధ సమస్యలు పరిష్కరించాలని, అడ్మిన్ సెక్రటరీ విధుల నుంచి బిల్ కలెక్టర్లను తప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.శివరాం ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, వీరభద్రయ్య, దేవరాయలు, కోశాధికారి ఎం.రవి, సెక్రటరీ కళ్యాణ్ చక్రవర్తి, రవిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గాలి సుధాకర్, జాయింట్ సెక్రటరీ రాజేష్, ప్రదీప్ కుమార్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ

ఇ ప్రొక్యూర్ మెంట్ రివర్స్ టెండరు నోటీసు

ఇ-ప్రొక్యూర్ మెంట్ ద్వారా **శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానము**, వాడపల్లి గ్రామము ఆత్రేయపురం మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నందు **శ్రీ వకుళా మాత** అన్నదానం బిల్డింగ్ నిర్మించుటకు **రూ.625.00 లక్షలకు** రివర్స్ టెండరు పిలుచుట జరుగుచున్నది. ఇతర వివరములకు వెబ్ సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.

కార్యనిర్వాహక అధికారి

Endowments Department, Andhra Pradesh

E-Procurement Reverse Tender Notice

Reverse Tender is invited for the work of **"Construction of Sri Vakula Matha Annadanam Building"** in the premises of Sri Venkateswara Swamy Temple, Vadapalli (V), Atreyapuram (M), Dr.B.R.Ambedkar Konaseema Dist. for an Estimated Amount of **Rs.625.00 Lakhs.** Other Details can be seen from www.apeprocurement.gov.in website.

Executive Officer

సంపాదకీయం

మహారాష్ట్ర స్పీకర్ దుస్సాహసం

బుధవారం మహారాష్ట్ర శాసనసభ స్పీకర్ చరిత్ర తిరగ రాశారు. ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేనలో ఉంటూ తిరుగుబాటుచేసి రాత్రికి రాత్రి ముఖ్యమంత్రి అయిపోయిన ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలోని శివసేన వర్గమే అసలైన శివసేన అని శాసనసభ స్పీకర్ రాహుల్ నార్వేకర్ తీర్పు చెప్పేశారు. మరో రకంగా చెప్పాలంటే కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఇష్టమైన వారే ఏ రాష్ట్రంలోనైనా ముఖ్యమంత్రులుగా ఉండగలరని, తిరుగుబాటు చేసి తమకు అనుకూలంగా వ్యవహరించే వారే అధికారంలో కొనసాగగలుగుతారని తేలిపోయింది. రాజకీయ పార్టీలకు, ఆ పార్టీల నాయకులకు ఇదే సూత్రం వర్తిస్తుంది. మోదీ, అమిత్ షా మెప్పు పొందిన పార్టీలే అధికారంలో కొనసాగే, రాజకీయ పార్టీల నాయకులుగా మనగలిగే స్థితి దాపురించింది. ఢిల్లీ సర్కారు పెత్తనం నిన్నటి దాకా ఒక శాసనసభలో మెజారిటీ లేకపోయినా ఎమ్మెల్యేలను కొనేసి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి పరిమితమయ్యేది. తమకు అనుకూలమైన గవర్నర్లను తోలుబొమ్మల్లా ఆడించినట్టు ఆడించడానికి పరిమితమయ్యేది. రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీలు మోదీకి, షాకు నచ్చక పోతే, తమ పార్టీ వారు కాకపోతే ఆ పార్టీలను చీల్చడంతోనే ఈ ఆట సాగేది. ఏ పార్టీకి ఎవరు నాయకులో స్పీకర్ ద్వారా నిర్ణయించే దుస్థితి మోదీ, షా పెత్తనంలో దాపురించింది. మోదీ, షా తలచుకుంటే ఏ పార్టీనైనా ముక్కలు చేయగలరు. ఆ పార్టీల అస్తిత్వానికే ఎసరు పెట్టగలరు. ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు చేసి బీజేపీతో కుమ్మక్కై ముఖ్యమంత్రి అయిపోయిన తరవాత శివసేన తమదంటే తమదని అసలు శివసేన నాయకుడైన ఉద్ధవ్ ఠాక్రే, షిండే నాయకత్వంలోని తిరుగుబాటు వర్గం ఎదుటి పక్షం శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించాలని వాదించాయి. శాసనసభ స్పీకర్ ఎటూ తేల్చలేదు. ఈ వ్యవహారం చివరకు సుప్రీంకోర్టుకు వెళ్లింది. అప్పుడు సుప్రీంకోర్టు మహారాష్ట్రలో రాజకీయ క్రీడ ఎంత వికృత స్థాయికి చేరిందో విశ్లేషించింది. అప్పుడు మహారాష్ట్ర గవర్నరుగా ఉన్న కొశియారీ ఏ అధికారమూ, అవసరమూ లేకుండా శాసనసభలో బలపరీక్ష నిర్వహించి షిండే ముఖ్యమంత్రి పదవిని సుస్థిరం చేయడం అన్యాయం, చట్ట విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆ సమయంలో శివసేన నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే కనక బలపరీక్షకు సిద్ధపడి రాజీనామా చేయకుండా ఉండి ఉంటే ఆయనను మళ్లీ ఆ స్థానంలో కూర్చోపెట్టేవాళ్లమని కూడా సుప్రీంకోర్టు చెప్పింది. కానీ ఉద్ధవ్ రాజీనామావల్ల ఆ అవకాశం లేకుండా పోయింది. ఏక్ నాథ్ షిండే కొంత మంది ఎమ్మెల్యేలను కూడగట్టుకుని పార్టీని చీల్చి బీజేపీతో కుమ్మక్కు అయిపోయినందువల్ల 2022 జూన్‌లో శివసేన రెండు ముక్కలైంది. ఆ సమయంలో శివసేన నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే షిండేను పార్టీ శాసనసభా పక్షం నాయకత్వ స్థానం నుంచి తొలగించారు. ఉద్ధవ్ ఠాక్రే వాదన ప్రకారం శివసేన జాతీయ కార్యవర్గం తీసుకునే నిర్ణయమే అంతిమం. కానీ ఆచరణలో ఈ వాదన నెగ్గలేదు. 2022 జూన్ నుంచి షిండే ముఖ్యమంత్రిగా కొనసాగుతూనే ఉన్నారు. ఎదుటి పక్షం శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించాలని శివసేనలోని రెండు వర్గాలూ మొరపెట్టుకున్నా స్పీకర్ ఉలకలేదు పలకలేదు. ఈ మొత్తం వ్యవహారంలో గవర్నర్ పాత్రను తీవ్రంగా అభిశంసించిన సుప్రీంకోర్టు ఎదుటి పార్టీ శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించాలన్న విషయమై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. కానీ ఆయన పట్టించుకోలేదు. వాయిదాల మీద వాయిదాలు పడ్డాయి. నాలుగైదు వాయిదాలు అయిన తరవాత ఎట్టి పరిస్థితిలోనూ డిసెంబర్ 31 కల్లా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా స్పీకర్ నిర్ణయం వెలువడనే లేదు. చివరకు జనవరి పదిలోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు గట్టిగా చెప్పిన తరవాత బుధవారం సాయంత్రం అసలైన శివసేన షిండే నాయకత్వంలోనిదేనని స్పీకర్ రాహుల్ నార్వేకర్ ప్రకటించారు.

నార్వేకర్ సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ఎన్నికల కమిషన్ వెబ్ సైట్లో ఉన్న సమాచారం ఆధారంగా షిండే వర్గమే అసలైన శివసేన అని తీర్పు చెప్పేశారు. ఈ తీర్పు సామాన్యమైంది కాదు. 1200 పేజీలు ఉంది. ఇంత సుదీర్ఘమైన తీర్పు రాయడానికే ఇంత ఎక్కువ సమయం పట్టిందేమో. నార్వేకర్ తరఫున ఆ తీర్పు ఎక్కడ, ఎవరు రాసినా ఎక్కువ సమయమే పడ్తుందిగదా! స్పీకర్ నిర్ణయం తమకు అనుకూలంగానే వస్తుందని ముఖ్యమంత్రితో సహా, షిండే వర్గంలోని వారు ఎప్పటి నుంచో ప్రచారం చేసుకుంటున్నారు. అంటే స్పీకర్ ఎవరి ఆదేశం మేరకు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వారికి కచ్చితంగా తెలుసునన్నమాట. స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్య వ్యతిరేకమైందనీ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని కాంగ్రెస్ మహారాష్ట్ర విభాగం అధ్యక్షుడు నానా పటోల్ మొరపెట్టుకుంటున్నారు. ఈ నిర్ణయం అంతిమంగా బీజేపీకే నష్టం కలిగిస్తుందని ఆయన శాపనార్థాలు పెడ్తున్నారు. ఏ పక్షం శాసనసభ్యులను స్పీకర్ అనర్హులుగా ప్రకటించకపోవడం మరో ఆశ్చర్యకరమైన విషయం. మహారాష్ట్రలోని రాజకీయ పరిస్థితినిబట్టి చూస్తే శివసేన వ్యవస్థాపకుడైన బాలా సాహెబ్ ఠాక్రే కుమారుడైన ఉద్ధవ్ ఠాక్రేకే శివసేన సభ్యుల మద్దతే కాక జనం మద్దతూ ఉందని రుజువు అవుతూనే ఉంది. ఈ భయం కారణంగానే బృహన్ ముంబై నగరక పాలక సంస్థ ఎన్నికలు నిర్వహించకుండా వాయిదా వేస్తూ వస్తున్నారు. స్పీకర్ నార్వేకర్ నిర్ణయం ప్రజాస్వామ్య సంప్రదాయాలు చిదిమేసింది. రాజ్యాంగ మూలసూత్రాలను ఛిద్రం చేసింది. మోదీ, షా అభిమతానికి అనుగుణంగా రాజ్యాంగాన్ని కాల రాయడంలో నార్వేకర్ ఇసుమంత కూడా వెనుకాడ లేదు. స్పీకర్ నిర్ణయాన్ని చూస్తే మాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఉద్ధవ్ వర్గం నాయకుడు సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలో తప్పేమీ లేదనిపిస్తుంది. శివసేనను చీల్చినపుడు షిండే తాను కూడగట్టిన శాసనసభ్యులను మొదట సూరత్, ఆ తరవాత అస్సాం, చివరకు ముంబైకి పిల్లి తన పిల్లలను తిప్పినట్టు తిప్పారు. గవర్నర్ కోశియారీ అండ షిండేకు ఎటూ ఉంది. షిండే నాయకత్వంలోని శివసేన వర్గానికన్నా బీజేపీకి ఎక్కువ స్థానాలున్నా బలంగా ఉన్న శివసేనను చీల్చడం కోసం బీజేపీ అగ్రనాయకత్వం మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఉపముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకోమని చెప్పింది. ఆ తరవాత బీజేపీ అండతో శరద్ పవార్ నాయకత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ నుంచి అమాంతం గోడదూకేసిన పవార్ మేనల్లుడు అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రి అయిపోయారు. శాసనసభ స్పీకర్ నాగోకర్ ప్రవేశ పెట్టిన కొత్త ఒరవడిని చూస్తే ఇలాంటి నిర్ణయాలే ఇతర చోట్ల కూడా జరిగే అవకాశం వస్తే బలమైన స్థానిక నాయకుల చేతుల్లో ఉన్న నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, నితీశ్ నేతృత్వంలోని జె.డి.(యు), జార్ఖండ్ ముక్తి మోర్చాకూ ఇదే గతి పట్టినా ఆశ్చర్య పడవలసిన అగత్యం లేదు. ఇక మిగిలిందల్లా ఉద్ధవ్ ఠాక్రే మళ్లీ సుప్రీంకోర్టు మెట్లెక్కడమే.

అందుబాటులోకి ప్రకృతి చికిత్సాలయాలు

ప్రకృతి వైద్యం అనేది మానవుడు సామరస్యంగా, ప్రకృతి నిర్మాణాత్మక సూత్రాలతో, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక దశలలో అతని జీవితంలో రూపొందించుకునే ఒక విధానం. ఇది ఆరోగ్యాన్ని పెంపొందించే, వ్యాధులను నివారించే చికిత్స చేసి స్వస్థత కలిగించి శక్తి, ఆరోగ్యాన్ని తిరిగి యధాస్థితికి తీసుకురాగలిగే గొప్ప అవకాశాలను కలిగి ఉంది. బ్రిటిష్ నేచురోపతి అసోసియేషన్ ప్రణాళికా ప్రకటన ప్రకారం "ప్రకృతి వైద్యం (నేచురోపతి) శరీరంలో అంతర్లీనంగా స్వస్థతను కలిగించే ఉనికిని గుర్తించి చేసే చికిత్సా విధానం". ఇది వ్యాధిని కలిగించే విషపూరిత పదార్థాలను మానవ శరీరం నుండి విసర్జించి వేసి వ్యాధులను నయం చేయడానికి మానవ వ్యవస్థకు సహకరించాలని సూచిస్తుంది. అన్ని వ్యాధులు, వాటి కారణాలు చికిత్సలు ఒకటే. బలమైన దెబ్బలు, గాయాలకు పర్యావరణ పరిస్థితులకు తప్ప, అన్ని వ్యాధులకు కారణం ఒకటే. శరీరంలో అనారోగ్యకరమైన పదార్థాలు పేరుకుపోయి ఉండడమే. వ్యాధులన్నింటికిచేసే చికిత్స శరీరంలో నుంచి పేరుకుపోయిన పదార్థాలను తొలగించి వేయడం. వ్యాధులు రావడానికి ముఖ్య కారణం శరీరంలో పేరుకుపోయిన అనారోగ్యకరమైన పదార్థాలే. బాక్టీరియా (మేలుచేసే లేక కీడుచేసే సూక్ష్మజీవులు), వైరస్ (రోగాలు కలుగజేసే ఒక రకమైన విషం). ఇవి పెరగడానికి అనువైన అనారోగ్యకరమైన పదార్థాలు, వాతావరణం. వ్యాధులకు మూల కారణం శరీరంలో అనారోగ్యకరమైన పదార్థాలు పేరుకుపోవడం, రెండవ కారణం బ్యాక్టీరియా. తీవ్ర వ్యాధులను శరీరం స్వయంకృషితో నయం చేసుకునేటటువంటివి. అందుచేత ఇవి మన స్నేహితులే తప్ప శత్రువులు కావు. దీర్ఘకాల వ్యాధులకు తప్పుడు చికిత్స-వ్యాధులను అణగదొక్కి ఉంచడం వాటి ఫలితాలు. బాధలను, కష్టాలను ఉపశమింపజేసే ఉపశమనకారి ప్రకృతి. వ్యాధులను నివారించుకోగలిగే శక్తిని, అనారోగ్యంగా ఉంటే తిరిగి ఆరోగ్యాన్ని చేకూర్చుకోగల శక్తినీ మానవశరీరం కలిగి వుంది. ప్రకృతి చికిత్సతో నయం చేసేది కేవలం వ్యాధి ఒకటే కాదు, వ్యాధికి గురైన రోగి మొత్తం శరీరమంతా చికిత్సను పొంది, తిరిగి యధాస్థితికి చేరుకుంటుంది. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతూ ఉండే రోగులు కూడా ప్రకృతి వైద్యంతో తులనాత్మకంగా తక్కువ సమయంలో విజయవంతంగా స్వస్థత చేకూరుతుంది. ప్రకృతి వైద్యంలో అణగారి ఉన్న వ్యాధులు కూడా బయటకు వచ్చి శాశ్వతంగా తొలగిపోతుంది. శారీరక, మానసిక, సాంఘిక, ఆధ్యాత్మికమైన అన్ని అంశాలనూ ఒకే సమయంలో ప్రకృతి వైద్యం ద్వారా చికిత్స పొందవచ్చు. ప్రకృతి వైద్యంలో 'ఆహారం మాత్రమే మందు', బయట ఔషధాలేవీ వాడరు. ఎవరి ఆధ్యాత్మిక విశ్వాసం ప్రకారం వారు ప్రార్థన చేయడం అనేది చికిత్సలో ఒక ముఖ్యమైన భాగం. ప్రకృతి వైద్య చికిత్సాలయాలు సామాన్య ప్రజలకు అందుబాటులోకివస్తే మెరుగైన వైద్య వ్యవస్థను రూపొందించవచ్చు. ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలను కల్పించి ప్రజలను ప్రకృతికి దగ్గర చేయాలి. ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ప్రజల్లో శారీరక శ్రమ తక్కువై విపరీతంగా బరువు పెరుగుతున్నారు. ప్రస్తుతం ప్రజల్లో అతిపెద్ద సమస్య స్థూలకాయం, మధుమేహం, బిపి, కండరాలు, కీళ్ల సమస్యలు, మానసిక ఆందోళన. రోజంతా కూర్చుని, శరీరానికి ఎలాంటి పని ఇవ్వకపోవడంతో, తినే ఆహారంలో కొవ్వు పొత్తికడుపులో చేరడం ప్రారంభిస్తాయి. చెడు ఆహారం జీవనశైలి అలవాట్లు అధిక జుట్టు రాలడానికి, చర్మం పెళుసుగా మారడానికి దారితీస్తుంది. వీటన్నింటికీ పరిష్కారం ఒక్కటే అది వ్యాయామం. బరువు తగ్గాలనుకునే వారికే కాదు, ఆరోగ్యంగా ఉండి జీవితాన్ని ఆనందంగా కొనసాగించేందుకు వారికి కూడా వ్యాయామం అవసరం. రోజుకు 30-40 నిమిషాలు వ్యాయామం చేయడం ద్వారా, చర్మం కాంతివంతంగా మారుతుంది, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది పొట్టలో కొవ్వు తగ్గుతుంది. ఎలాంటి వ్యాయామాలు చేయాలి, ఏ వయస్సు వారు ఎలాంటి నియమాలు పాటించాలి? ఎలాంటి ఆహార అలవాట్లు అలవరచుకోవాలి, వ్యాయామాలు ఎలా సహాయపడతాయో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ప్రకృతి వైద్య చికిత్సాలయాలు ప్రతి జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసి, ప్రజలు ప్రకృతికి దగ్గరగా ఉండేట్లు చూడాలి. స్వయం నియంత్రణ, మంచి ఆరోగ్య అలవాట్లు, ఆహార అలవాట్లు అవలంబించుకొనే విధంగా ప్రజలను చైతన్య పరచాలి. జీవనశైలి వ్యాధిగ్రస్తులకు, చెడు అలవాట్లకు బానిసైన వ్యక్తులకు, బుద్ధిమాంద్యం పిల్లలకు ఆక్యుపెషనల్ థెరఫీ, రీహాబిలిటేషన్ సెంటర్లు, హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. జంక్ ఫుడ్, ఆరోగ్యాన్ని పాడు చేసే శీతల పానీయాలు, మద్య పానీయాలు, ప్యాకేజ్డ్ ఫుడ్, శుచి శుభ్రత నాణ్యతలేని తినుబండారాల పట్ల ప్రజలను చైతన్యపరచాలి.

దా యం. అఖిల మిత్ర,
ప్రకృతి వైద్యులు.

విడివిడిగా ఎన్నికలే మేలు

డి. రాజా,
సీపీఐ ప్రధాన కార్యదర్శి

(ఒకే దేశం, ఒకే ఎన్నికపై వేసిన కమిటీకి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా బహిరంగ లేఖ)

మన రాజ్యాంగ రూపకర్తలకు మనదేశం ఎంతో వైవిధ్యంగలదని స్పష్టంగా తెలుసు. భిన్నరంగాలలో సవాళ్లను ఎదుర్కొవాలని తెలుసు. వైవిధ్యంగల ప్రజాప్రాతినిధ్య, బాధ్యతాయుతమైన పవిత్రమైన అవగాహనతో ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించడం ప్రారంభించాము. ఓటు హక్కుతో విస్తరించేందుకు వీలుగా రాజ్యాంగాన్ని రూపొందించారు. 21 ఏళ్లకు సార్వత్రిక ఓటు హక్కును ఇప్పుడు 18ఏళ్లు చేసింది. ఇందుకు స్త్రీ, పురుష,మతం,కులం, జన్మించిన స్థలం, ఇంకా భిన్నత్వం అంశాలను అనుసరించి ఓటు హక్కును నిర్ధారిస్తారు. సమాఖ్య, రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య హక్కులు, బాధ్యతలను ఆయా సబ్జెక్టులను విభజించారు. అలాగే జాతీయ, స్థానిక ఆకాంక్షలను సైతం రూపొందించారు. రాజ్యాంగంలోని 324 అధికరణ ప్రకరం, శాశ్వతమైన, స్వతంత్రమైన భారతదేశ ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ నిర్దిష్టకాలం గడువుతో స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరుపుతుంది.

ప్రస్తుతంఉన్న ఎన్నికల వ్యవస్థలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు అసెంబ్లీ ఆమోదం ఉన్నంతవరకు అంటే ఐదు సంవత్సరాల వరకు ప్రభుత్వం కొనసాగుతుంది. మన రాజ్యాంగం రూపొందించినప్పుడు డా.అంబేద్కర్, ఇతర నాయకులు స్థిరత్వ బాధ్యతను ఆకాంక్షించారు. "ఒకే దేశం, ఒక ఎన్నిక ప్రతిపాదన వివిధ రాష్ట్రాల ప్రజల ఒకే అభిప్రాయం అని చెప్పేందుకు చేస్తున్న అభిప్రాయం, వివిధరాష్ట్రాల ప్రజల అభిప్రాయం ఒక్కటిగా ఎలా ఉంటుంది? లోకసభ ఎన్నికలలో దేశ ప్రజలంతా ఒకే రకమైన అభిప్రాయం వ్యక్తం చేయవచ్చు. రాజకీయపార్టీలు దేశప్రజలందరినీ ఐదేళ్లకు ఒకసారి కలుసుకున్నప్పుడు బాధ్యత, జవాబుదారీతనం బలిపశువులు అవుతాయి. ఈ విధానాన్ని అనుసరిస్తే, ఒకవేళ లోకసభ అవిశ్వాస తీర్మానంవల్ల రద్దయినా, లేదా ప్రభుత్వానికి మెజారిటీ లేకపోయినా, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు ఎన్నికలు నిర్వహించవలసిన వస్తుంది. రాష్ట్రాల్లో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడకపోయినా, అనివార్యంగా మధ్యలోనే ఎన్నికలు జరపవలసివుంది.

ఒక రాష్ట్రంలో పార్టీలకు ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించినట్లు వుతుంది. అలాగే ప్రజాప్రాతినిధ్య పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు వ్యతిరేకం అవుతుంది. మన రిపబ్లిక్ ఏర్పడిన తర్వాత అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోకసభకు ఒకేసారి ఎన్నికలు ఎందుకు జరిగాయని లోతుగా ఆలోచించాలి. 1957లో రెండవ సార్వత్రిక ఎన్నికలు జరిగిన తర్వాత కేరళరాష్ట్ర అసెంబ్లీ సీపీఐ గెలిచి ప్రభుత్వం ఏర్పాటుచేసింది. మొట్టమొదటిసారిగా రాజ్యాంగంలోని 356వ అధికరణను ఉపయోగించి కేరళ ప్రభుత్వాన్ని రద్దు చేశారు. సార్వత్రిక ఎన్నికలు ప్రత్యేకంగా జరిగాయి. 1960లో కేరళ అసెంబ్లీ ఎన్నికల జరిగాయి. ఏ పార్టీ మెజారిటీ నిరూపించుకోకపోవడంతో 1967లో మళ్లీ కేరళ అసెంబ్లీ ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ప్రజాస్వామ్య ఎన్నికలక్రమం ఇలా జరగడం సహజమే. ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలను బలవంతంగా రుద్దరాదు. అదే సమయంలో లోకసభ ఎన్నికలతోపాటు, రాష్ట్ర అసెంబ్లీలను కలపకూడదు.

1967 తర్వాత ఇతర శక్తులు ఒక్కటై ఒకే పార్టీ పాలనను సవాలు చేశాయి. ప్రధానపార్టీ 8 రాష్ట్రాలలో అధికారం కోల్పోయింది. 1967 ఎన్నికల ఫలితాలు మరింత ప్రజాస్వామ్యానికి సాక్ష్యంగా నిలిచాయి. ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీలో ఎన్నికలు జరిగి అత్యధిక ప్రజలు ఆకాంక్షలు వ్యక్తమయ్యాయి. జమిలి ఎన్నికలుగాకుండా విడివిడిగా ఎన్నికలు జరిగి ప్రజాస్వామికంగా, ప్రజల న్యాయ బద్ధమైన ఆకాంక్షలు ప్రతిబింబించాయి. జమిలి ఎన్నికల నుంచి విడివిడిగా ఎన్నికలు ఫెడరల్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఎన్నికలకు సాక్ష్యంగా నిలిచాయి. బాబ్రీమసీదు కూల్చివేత అనంతరం రాజ్యాంగ యంత్రాంగం విఫలమైందని చెప్పి నాలుగురాష్ట్రాల ప్రభుత్వాలను రాష్ట్రపతి రద్దు చేశారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో సంభవించిన కల్లోల పరిస్థితులను చూపించి 'ఒకే దేశం, ఒకే ఎన్నిక" ప్రతిపాదన పరిష్కారం కాదు. అప్రజాస్వామిక పరిస్థితులు ఏర్పడినప్పుడు రాష్ట్రపతి పాలన కోరాలి. అయితే కేవలం ఎన్నికల

ఖర్చులో పొదుపు జరుగుతుందనే ఒకేఒక్క కారణం రీత్యా 'ఒకే దేశం ఒకే ఎన్నికలు' ఆలోచనకు వాంఛనీయత కనిపిస్తున్నది. వేల కోట్ల రూపాయలు ఈ జమిలి ఎన్నికల వల్ల ఖర్చు కలిసి వస్తుంది. ఏకకాలంలో ఇలా ఎన్నికలు జరపడంవల్ల ఈ ఖర్చులు సగానికి సగం మేరకు తగ్గిపోతాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఐనప్పటకీ ఎన్నికల సంఘం నుండి సేకరించిన గణాంకాలను పరిశీలిస్తే, మనదేశంలో ఎన్నికల ఖర్చు అంత తక్కువ ఏమీ కాదు. అంత పొదుపుగా దేశంలో ఎన్నికలు అస్సలు జరగడంలేదని ఎన్నికల సంఘం చాలా స్పష్టంగా తేటతెల్లం చేసింది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో లోకసభ, అసెంబ్లీకి 2014లో ఏకకాలంలో ఎన్నికలు జరిగాయి. సగటున ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో ఖర్చు రూ.1.66 కోట్లు. మరో పెద్ద రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో లోకసభ, అసెంబ్లీకి వేరు వేరుగా ఎన్నికలు జరిగాయి. వాటి మొత్తం ఖర్చు ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.1.43 కోట్లు, ఏకకాలంలోగానీ, వేరు వేరుగా గానీ జరిగిన ఎన్నికల మధ్య ఖర్చు చాలా తక్కువే. అందువల్ల ఒకే ఎన్నికలు, ఒకే దేశం నినాదంవల్ల పెద్దగా ఒరిగేదేమీలేదు. అయితే దీనివల్ల జరిగేది ఏమిటంటే ప్రజల ప్రజా స్వామ్య ఓటు హక్కును హరించడంతప్ప ఎన్నికల ఖర్చునుగానీ, ఎన్నికల్లో అక్రమాలను గానీ ఏ మాత్రం అడ్డుకోలేరు. పొదుపు జరుగుతుందనే వాదన కూడా ఎంతమాత్రం సరైందికాదు. ఏక కాలంలో ఎన్నికలు నిర్వహిస్తే కోట్ల సంఖ్యలో ఓటింగ్ యంత్రాలను సేకరించవలసి వస్తుంది. అది అన్నింటికంటే అది పెద్ద విన్యాసంగా మారుతుంది.

ఓటింగ్ యంత్రాలపై కూడా చాలా సందేహాలు తలెత్తుతున్నాయి. ఓటింగ్ యంత్రాలను తయారుచేయడం, కొనుగోలు చేయడం అంటే భారీ ఎత్తున వేల కోట్లలో ఖర్చు చేయాల్సిందే. పైగా మళ్ళీ ఐదేళ్ళ పాటు వాటన్నింటినీ చాలా సురక్షితంగా తిరిగి ఉపయోగించడానికి వీలుగా గోదాములలో భద్రపరచవలసి ఉంటుంది. ఆ గోదాములను చాలా జాగ్రత్తగా పరిరక్షించాలి. తనిఖీలు చేయాలి. వివిధ రాష్ట్రాలలో ఐదేళ్ళకు ఒకసారి లోకసభ, అసెంబ్లీ, స్థానిక స్వపరిపాలనా సంస్థలకు ఎన్నికలు నిర్వహించడానికి, ధనాన్ని పొదుపు చేయడం కోసం ఐదేళ్ళపాటు ఓటింగ్ యంత్రాలను దాచి ఉంచడం, తిరిగి ఉపయోగించడం అనే ఈ విధమైన చర్యలూ ఎంతమాత్రం వాదనలకు అందేవి కాదు. వాటి చెల్లుబాటకు కూడా ఎంత మాత్రం హామీ లభించే అవకాశం ఉండదు.

కానీ అసలు విషయం ఏమిటంటే, మన దేశానికి ఎన్నికల సంస్కరణలు కావాలి. సంపూర్ణంగా సమగ్రంగా ఎన్నికల వ్యవస్థను సంస్కరించాలి. దేశంలో స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఏ విధమైన అక్రమాలకూ తావు లేకుండా ఎన్నికల జరిగే వాతావరణం ఏర్పాటు చేయాలి. ఆ సదుద్దేశంతో ఎన్నికల సంస్కరణలు చేపట్టాలి. కేవలం ఎన్నికల ఖర్చు తగ్గించాలనే ఒకే ఒక్క కారణం ప్రాతిపదికపై 'ఒకే దేశం ఒకే ఎన్నికలు' అంశాన్ని అమలు చేయకూడదు. దేశంలో రాజకీయ పార్టీలను కేవలం ఆ ఒక్క అంశానికి మాత్రమే పరిమితం చేయకూడదు. మనచుట్టూ అందుబాటులో ఉండే ఇతర విధాలైన ప్రత్యామ్నాయాలను పరిశీలించకుండా ఒకే అంశానికి కనబడదు. కేంద్రంలో హోంశాఖమంత్రిగా పనిచేసిన ఇంద్రజిత్ గుప్తా కమిటీ సిఫార్సు చేసిన విధంగా రాజకీయపార్టీల ఎన్నికల వ్యయాన్ని ప్రభుత్వమే భరించేలా మనకు అందుబాటులో ఉన్న ఒక ప్రత్యామ్నాయం గురించి కూడా ఆలోచించాలి. ఎన్నికల సమయంలో, ఇతర సందర్భాలలో జరుగుతున్న వ్యవస్థాగతమైన అవినీతికి మనం అడ్డుకట్టవేసి తీరాలి. ఎన్నికల బాండ్ల పేరుతో వ్యవస్థాగతమైన అవినీతి జరుగుతోంది. దాన్ని అడ్డుకోవాలి. ఎన్నికల్లో కండబలం, ధనబలం వంటివాటిని నిర్మూలించడంకోసం అత్యుత్తమమైన చట్టాలను తీసుకురావాలి. 'ఒకేదేశం- ఒకే ఎన్నికలు' విధానం వల్ల దేశంలో విద్వేష ప్రసంగాలను, విద్వేష ప్రచారాన్ని, ర్యాలీలను కొద్దిమేరకు అయినా తగ్గించ వచ్చునని కొంతమంది వాదిస్తారు. కొద్దిమేరకు అంటే అర్థం కొన్ని ప్రసంగాలను మాత్రమే. ఈ విధమై న వాదనలు చాలా హాస్యాస్పదంగా ఉన్నాయి. ఈ విధంగా విద్వేష ప్రసంగాలుచేస్తూ సమాజంలో హింసను ప్రేరేపించేవారికి కఠిన శిక్షలు విధించాలని సిఫార్సు చేయకుండా ఈ విధమైన వాదనలు హాస్యాస్పదం. ఈ విధంగా హాస్యాస్పద సలహాలు చెప్పడం అంటే ప్రజలను రాజకీయ నాయకులు ఎ క్కువగా కలుసుకోకుండా వారిపై ఆంక్షలు విధించే ప్రయత్నం చేయడమే. ప్రజలకు సమాచారాన్ని స్వేచ్ఛగా న్యాయబద్ధంగా చేరనీయకుండా మీడియా సంస్థల వివక్ష, పక్షపాతం వ్యవస్థకు చాలా నష్టం కలి గిస్తున్నది. దీనిని నియంత్రించవలసి ఉన్నది. ఈ విధమైన చర్యలు తీసుకోవాలేతప్ప జమిలి ఎన్నికలు జర పాలనుకోవడమే ఏకైక ఉపాయంగా భావించరాదు.

దేశంలో లోకసభకు, రాష్ట్రాలలో అసెంబ్లీలకు ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించాలనే ప్రతిపాదనను భారత కమ్యూనిస్టుపార్టీ వ్యతిరేకిస్తున్నది. లా కమిషన్ ఆఫ్ ఇండియా ఈ విషయంపై రాజకీయపార్టీల నుండి అభిప్రాయాలు సేకరిస్తున్నది. ఈ జమిలి ఎన్నికలపై లా కమిషన్ ఆఫ్ ఇండియాకు లిఖితపూర్వకమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ విధంగా ఇప్పటికే 13 రాజకీయపార్టీలు నిర్ద్వంద్వంగా ఈ జమిలి ఎన్నికలను వ్యతిరేకించాయి. మరో మూడు రాజకీయపార్టీలు ఈ విధమైన ప్రతిపాదన పట్ల మరో మూడు రాజకీయ పార్టీలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేశాయి. మొత్తం ఈ విధంగా ఈ విషయంపై 26 పార్టీలు తమ తమ అభిప్రాయాలు వెల్లడించాయి. భారత కమ్యూనిస్టుపా ర్టీ సహా నాలుగు జాతీయ పార్టీలు ఈ జమిలి ఎన్నికల ప్రతిపాదనను వ్యతికించాయి. కేవలం ఒకే ఒక్క పార్టీ ఈ ప్రతిపాదనకు మద్దతు తెలియజేసింది. మరోసారి ఇదేవిధంగా సంప్రదింపులు చేసినప్పుడు మొత్తం 21 రాజకీయ పార్టీలకుగాను 10 పార్టీలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించాయి. ఒక పార్టీ తీవ్ర భయాందోళన వ్యక్తం చేసింది. మళ్ళీ భారత కమ్యూనిస్టుపార్టీ సహా మూడు జాతీయ రాజకీయ పార్టీలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించగా, ఒకేఒక్క పార్టీ ఈ ప్రతిపాదనను సమర్థించింది. అంటే దీని అర్థం ఈ విషయంలో రాజకీయపార్టీల మధ్య ఏకా భిప్రాయం లేదు. అందువల్ల 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' అనే ప్రతిపాదనను భారత కమ్యూనిస్టుపార్టీ చాలా స్పష్టంగా, నిర్ద్వంద్వంగా తన వైఖరిని వెల్లడించింది. తీవ్రంగా ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నది. ఈ ప్రతిపాదన దేశ ప్రజాస్వామ్యానికి ఒక ప్రతిబంధకం, రాష్ట్రాల హక్కులకు ఆంక్షలు విధించే నిర్బంధ విధానం. 'ఒకేదేశం-ఒకే ఎన్నికలు' ప్రతిపాదన దేశ భిన్నత్వానికి, భిన్నాభిప్రాయాలు వ్యక్తీకరణకు తెర దించే ప్రయత్నం. ఏకీకృత ఎన్నికల పేరుతో భిన్నాభిప్రాయాన్ని అడ్డుకోవడమే. ఈ విధమైన ప్రతిపాదన దేశాన్ని ఏకపార్టీ పరిపాలనలోకి నెట్టేందుకే. భారత కమ్యూనిస్టుపార్టీ అత్యంత ఆగ్రహంతో, ఎంతో బలంగా ఆ భావనను తిరస్కరిస్తున్నది. ఈ విధమైన ఆలోచనలు, ప్రతిపాదనలూ భారతదేశాన్ని పూర్తిగా అప్రజాస్వామ్యయుతంగా, జవాబు దారితనంలేని వ్యవస్థగా రూపాంతరీకరణ చేసేందుకే.

ఆహ్వాన నిరాకరణ కాంగ్రెస్‌కు విషమ పరీక్షే

ఆర్వీ రామారావ్

వచ్చే 22వ తేదీన అయోధ్యలో నిర్మిస్తున్న రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఆహ్వానాన్ని కాంగ్రెస్ సగౌరవంగానే నిరాకరించింది. నిజానికి రామమందిర నిర్మాణ ట్రస్టు కాంగ్రెస్‌ను ఆహ్వానించలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధిపతి సోనియా గాంధీ, లోకసభలో కాంగ్రెస్ పక్ష నాయకుడు అధీర్ రంజన్ చౌదరీని మాత్రమే ఆహ్వానించింది. ఒక్కొక్క ఆహ్వానంపై ఒక్కరే హాజరు కావాలన్న నియమం ఉంది కనక ఇవి వ్యక్తిగత ఆహ్వానాలకిందే లెక్క. ఆలయ నిర్మాణ సంరంభానికి హాజరు కాకూడదని నిర్ణయించుకోవడానికి కాంగ్రెస్‌కు దాదాపు పక్షం రోజులు పట్టింది. అంటే నిర్ణయం సులభంగా జరగలేదు. ఉత్తరాదిలోని కొందరు నాయకులు కాంగ్రెస్ నాయకులు ఆలయ ఆరంభోత్సవానికి హాజరు కావాల్సింది అని మంద్ర స్థాయిలో అంటున్నారు. ఇతర పార్టీల నాయకులలో కొందరికి ఆహ్వానాలు అందాయి. కాంగ్రెస్ ఆహ్వానాన్ని తిరస్కరించడానికి ప్రధానంగా రెండు కారణాలు చూపింది. మొదటిది ఆలయ నిర్మాణం ఇంకా పూర్తి కాకపోవడం. అసంపూర్ణ ఆలయంలో విగ్రహాలు ప్రతిష్ఠించ కూడదని కాగ్రెస్ అంటోంది. ఆదిశంకరుడు నెలకొల్పిన నాలుగు పీఠాల అధిపతులు ఇదే మాట చెప్తున్నారు. మోదీ ఆలయాన్ని ప్రారంభించడాన్ని కాంగ్రెస్ అభ్యంతర పెట్టలేదు కాని అందులో రాజకీయం ఉందంటోంది. పీఠాధిపతులు మాత్రం నిర్మాణం పూర్తి కాని ప్రారంభోత్సవాన్ని తప్పుపట్టారు. ఈ పీఠాధిపతులు హిందూ వ్యతిరేకులని, రాముడికి వ్యతిరేకులని ఎవరూ అనడం లేదు కానీ కాంగ్రెస్‌ను మాత్రం దుయ్యబడ్తున్నారు. చిన్నా, పెద్ద బీజేపీ నాయకులందరూ కాంగ్రెస్ మీద దాడి మొదలు పెట్టారు. ఈ వాదనలను అందరికీ చేరవేసే గోదీ మీడియా ఉండనే ఉంది. టీవీ చానళ్లకూ కొదవలేదు. అవి కాంగ్రెస్‌ను తూలనాడడంలో పోటీపడ్తున్నాయి.

రాముడిని కోట్లాది మంది ఆరాధిస్తారనీ, అర్చిస్తారనీ అయినా ఆలయ ప్రారంభ సమారోహాన్ని బీజేపీ రాజకీయం చేసింది కనక తమ నాయకులు హాజరు కారని కాంగ్రెస్ తేల్చి చెప్పింది. మతం వ్యక్తిగత వ్యవహారం అని కూడా పేర్కొంది.

ఆలయ ఆరంభ సంరంభ ప్రతిధ్వనులు దేశమంతా వినిపిస్తున్నాయి. సంఘ్ పరివార్ పదాతి దళాల వారు ఇంటింటికీ తిరిగి అక్షతలు పంచుతున్నారు. అయోధ్య నుంచి తెచ్చామంటున్న పిడికెడు మట్టి, రామ మందిర చిత్రపటాలూ పంచుతున్నారు. ప్రతి ఇంటి మీద స్టిక్కర్లు అంటించి వెళ్లి పోతున్నారు. అడ్వానీ రథయాత్ర యాత్ర చేసినప్పుడూ ఇంటికో ఇటుక, ఒక రూపాయి సేకరించడం ఈ సమయంలో గుర్తుకు రాక తప్పదు. 2019లో అయోధ్య వివాదంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఆలయ నిర్మాణంకోసం ప్రత్యేక ట్రస్టు ఏర్పాటు చేయాలి. అలాగే చేశారు. ఆహ్వానాలూ ఆ ట్రస్టు తరఫునే పంపినీ అయ్యాయి. కానీ ట్రస్టు నామ మాత్రంగానే మిగిలిపోయింది. హడావుడి అంతా సంఘ్ పరివార్ కార్యకర్తలదే. అయోధ్యలోనే కాదు ఎక్కడ చూసినా సంఘ్ కార్యకర్తల హడావుడే. ఆలయ ప్రారంభోత్సవం కోసం ఏర్పాటు చేసిన రథాల (బస్సులు) నిండా మోదీ ఫొటోలే. అందులో ఏ ధర్మాచార్యుడి, సాధువు, సంత, పీఠాధిపతి బొమ్మలు మచ్చుకైనా లేవు. రాముడి విగ్రహ నమూనాలు కొని అమ్మాలని మాల్స్ వారిని, దుకాణదార్లను కోరుతున్నారు. ఈ కోరడం ఆదేశంలాగా సాగుతోంది. ఇదంతా బీజేపీ చేస్తున్న రాజకీయమే కనక తాము హాజరు కాబోమని కాంగ్రెస్ తెలియజేసింది. అక్కడ జరగబోయే కార్యక్రమ సరళి చూసినా అంతా మోదీ మయమే. విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ తరవాత ఆలయ ముఖద్వారం ఎదుటే మోదీ ప్రసంగం ఉంటుందట. ఆహ్వానంలో ఆయనకే పెద్ద పీట. మతాధిపతుల ఊసే లేదు. మోదీ తరవాత పీట ఆర్.ఎస్.ఎస్. అధినేత మోహన్ భగవత్‌కు దక్కింది. ఆ తరవాతి స్థానం ఉత్తరప్రదేశ్ గవర్నర్, ముఖ్యమంత్రికి దక్కింది. వీరంతా రాజకీయ నాయకులేగా! అందుకే బీజేపీ మొత్తం వ్యవహారాన్ని రాజకీయం చేస్తోంది కనక తాము వెళ్లం అని కాంగ్రెస్ అంటోంది.



ఆలయ ప్రతిష్ఠాపనకు ఎవరెవరిని ఆహ్వానించారు, ఎవరిని మినహాయించారన్నది కూడా ఆసక్తికరంగానే ఉంది. అదానీకి, అంబానీకి కూడా ఆహ్వానాలందాయి. మోదీ ప్రసంగించే సభలో వారికి సముచిత స్థానమే కేటాయిస్తారు. సందేహం లేదు. అలాంటప్పుడు సోనియా, ఖర్గేకు వారి సరసన సీట్లు కేటాయించేవారా లేదా వెనక సీట్లకు పరిమితం చేసే వారా? మతాధిపతుల, పీఠాధిపతుల ప్రవచనాలు వినిపించకపోవచ్చు. ఈ ప్రశ్నలన్నీ కాంగ్రెస్ మెదళ్లకు తట్టి ఉండకుండా ఉండే అవకాశమూ లేదు. ప్రతిపక్ష నాయకులు ఎవరైనా వెళ్లినా వారూ ప్రేక్షకులుగా మిగిలిపోవలసిందే. ప్రారంభోత్సవ సందడిలో భక్తి, మతం ఛాయలు అత్యల్పం. పూజాదికాలు జరిగే చోట అనుసరించే పద్ధతులు భిన్నంగా ఉంటాయి. కానీ అంతా మోదీ రాజకీయ చదరంగమే పరుచుకుంది. మోదీ ప్రసంగాన్ని గోదీ మీడియా జాతినుద్దేశించిన సందేశంగా ప్రచారం చేసి తీరుతుంది.

మందిర ప్రారంభోత్సవం గురించి దేశం నలుమూలలా ప్రచారం కొనసాగించి ఇదేదో జాతీయ కార్యక్రమంలా కనిపించేట్టు చేస్తున్నారు. నిజంగా జాతీయ కార్యక్రమమే అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేరు నామమాత్రంగా కూడా వినిపించడం లేదే. నూతన పార్లమెంటు భవన ప్రారంభోత్సవ సమయంలోనూ ఆమెను విస్మరించారు. అప్పుడూ ప్రతిపక్షాలు బహిష్కరించాయి. అంతా సంఘ్ పరివార్ చేతిలో ఉంటే అలాగే జరిపించి ఉండొచ్చుగా! ఇలాంటి కార్యక్రమానికి ఏర్పాట్లు చేసే శక్తి సామర్థ్యాలు యూపీ ప్రభుత్వానికో, కేంద్ర ప్రభుత్వానికో లేవనుకోలేంగదా. కానీ మోదీ తంత్రం అది కాదు. వేదిక ఆలయ నిర్మాణ ట్రస్టుది. పండగ సంఘ్ పరివార్ సొంతం. ఆట, పాట, మాట మోదీది. బీజేపీ చేతిలో అధికారం, డబ్బు, సాధన సంపత్తి అపారంగా ఉంది. ప్రధానమైన మీడియా ఎటూ దాసోహం అంటోంది. ఇల్లిల్లూ తిరిగి హడావుడి చేయడానికి లక్షలాదిమంది కార్యకర్తలున్నారు. రామమందిర ఉద్యమానికి కర్త కర్మ క్రియ అయిన లాల్ కృష్ణ అద్వానీకి, మరో సీనియర్ నాయకుడు మురళీ మనోహర్ జోషీకి ఆహ్వానం ఇచ్చినట్టే ఇచ్చి మీరు రాకపోవడమే మంచిదని చెప్పారు. అదీ మోదీ దెబ్బ అంటే. బాబ్రీ మసీదు గుమ్మటాలను పలుగులు, పారలతో ధ్వంసం చేయడంలో అప్పుడు ప్రధాన పాత్ర శివసైనికులదే. కానీ ఇప్పుడు శివసేన నాయకుడు ఉద్ధవ్ ఠాక్రేకు ఆహ్వానమైనా లేదు. ఈ నేపథ్యాన్నంతా గమనిస్తే అయోధ్య వెళ్లకూడదని కాంగ్రెస్ నిర్ణయించడం సబబే. కానీ ఈ నిర్ణయాన్ని సమర్థించుకోవడం, ప్రజలకు అర్థమయ్యేలా వివరించడం పెద్దపని. ఆహ్వానాన్ని తిరస్కరిస్తున్నామని విడుదల చేసిన పత్రికా ప్రకటనను "ఎక్స్"లో ఉంచితే పనైపోదు. వెళ్తే ముస్లింల ఓట్లు పోతాయి, వెళ్లకపోతే హిందువుల ఓట్లు కోల్పోతాం అన్న లెక్కలు వేస్తూ కూర్చోకుండా కాంగ్రెస్ మంచి పనే చేసింది.

ఆందోళనకరంగా కోవిడ్ వ్యాప్తి

దేశవ్యాప్తంగా 514 కొత్త కేసులు

3 వేలకు పైగా క్రియాశీల కేసులు

న్యూఢిల్లీ: దేశంలో మరోసారి కోవిడ్ ప్రబలడం ఆందోళన కలిగిస్తోంది. అయితే గత రెండు రోజులతో పోలిస్తే రోజూవారీ కేసుల్లో తగ్గుదల నమోదైంది. గురువారం ఉదయం 8 గంటలకు తాజాపర్చిన గణాంకాల ప్రకారం గత 24 గంటల వ్యవధిలో 514 కేసులు బయటపడినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తాజా కేసులతో కలిపి దేశంలో వైరస్ బారిన పడినవారి సంఖ్య 4,50,20,386కు చేరింది. ప్రస్తుతం దేశంలో 3,422 క్రియాశీల కేసులు ఉన్నాయి. ఇక బుధవారం ఒక్కరోజే మూడు మరణాలు నమోదయ్యాయి. మహారాష్ట్రలో ఇద్దరు, కర్నాటకలో ఒకరు మహమ్మారి కారణంగా ప్రాణాలు కోల్పోయారు. దీంతో దేశంలో మొత్తం కోవిడ్ మరణాల సంఖ్య 5,33,409కి చేరింది. ఇక ఇప్పటి వరకూ కోవిడ్ నుంచి 4,44,83,502 మంది కోలుకున్నారు. ప్రస్తుతం దేశంలో 0.01 శాతం మాత్రమే క్రియాశీల కేసులు ఉన్నట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. రికవరీ రేటు 98.81 శాతం, మరణాల రేటు 1.18 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. ఇప్పటి వరకూ 220.67 కోట్ల (220,67,82,284) కరోనా వాక్సిన్ డోసులు పంపిణీ చేసినట్లు వెల్లడించింది. 2021 ఏప్రిల్, జూన్‌లలో సంభవించిన డెల్టా వేవ్ సమయంలో అత్యధిక సంఖ్యలో రోజువారీ కొత్త కోవిడ్ కేసులు, మరణాలు నమోదయ్యాయి. భారతదేశం ఇప్పటికే మూడు దఫాలుగా కోవిడ్ దాడిని ఎదుర్కొంది. గరిష్ఠంగా మే 7, 2021న 4,14,188 కొత్త కేసులు, 3,915 మరణాలు నమోదయ్యాయి.

827 జేఎన్.1 కేసులు

దేశంలో ఇప్పటివరకు కోవిడ్-19 సబ్-వేరియంట్ జేఎన్.1 కేసులు 827 నమోదైనట్లు అధికారులు తెలిపారు. 12 రాష్ట్రాలలో ఈ కొత్త వేరియంట్ వెలుగు చూసింది. అత్యధికంగా మహారాష్ట్రలో 250 కేసులు, కర్నాటక- 199, కేరళ-155, గోవా -49, గుజరాత్- 36, ఆంధ్ర ప్రదేశ్-30, రాజస్థాన్-30, తమిళనాడు, తెలంగాణ నుండి 26 చొప్పున, దిల్లీ-22, ఒడిశాలో 3, హరియాణాలో ఒకటి చొప్పున కోవిడ్ జేఎన్.1 కేసులు నమోదయ్యాయి. అయితే జేఎన్.1 సోకిన వారిలో ఎక్కువమంది ఇంటి వద్దనే చికిత్స పొంది కోలుకుంటున్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది తేలికపాటి అనారోగ్యాన్ని సూచిస్తోందని అధికారులు తెలిపారు. దేశంలో కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుదలతో పాటు జేఎన్.1 సబ్‌వేరియంట్‌ను గుర్తించిన నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని... రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్రం కోరింది.

కోవిడ్ వైరస్‌తో డిసెంబరులో 10వేల మంది మృతి: డబ్ల్యూహెచ్ఓ

ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్-19 వైరస్ వ్యాప్తి చెందుతూనే ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తాజాగా హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా పాక్షికంగా ప్రబలుతున్న కోవిడ్ వైరస్ పెద్ద ముప్పుగా మారిందని డబ్ల్యూహెచ్ఓ చీఫ్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ చెప్పారు. గత డిసెంబరు లో కోవిడ్ వల్ల 10వేలమంది మరణించారని డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది. క్రిస్మస్ సెలవుల కాలంలో కోవిడ్ జేఎన్ 1 వేరియంట్ అధికంగా వ్యాప్తి చెందింది. కోవిడ్ వైరస్ ఇంకా ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తిచెందుతూనే ఉందని, ఈ వైరస్ వల్ల నవంబరు నెలలో ఆసుపత్రుల్లోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో చేరిన వారి శాతం 42 నుంచి 62 శాతానికి పెరిగిందని కూడా డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది. కోవిడ్ వైరస్ అమెరికా, యూరప్ దేశాల్లో అధికంగా ప్రబలిందని టెడ్రోస్ పేర్కొన్నారు. కోవిడ్ వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని దేశాలు జాగ్రత్తలు తీసుకోవాలని డబ్ల్యూహెచ్ఓ సూచించింది.

కోవిడ్ అన్ని వేరియంట్లకు ఒకే టీకా?

అభివృద్ధి చేసిన బెంగళూరు ఐఐఎస్సీ శాస్త్రవేత్తలు

బెంగళూరు : కర్నాటకలోని బెంగళూరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) శాస్త్రవేత్తలు వినూత్నమైన కోవిడ్-19 టీకాను అభివృద్ధి చేశారు. కోవిడ్‌కు చెందిన అన్ని రకాల ఉపరకాలను ఇది సమర్థంగా ఎదుర్కొంటోందని చెబుతున్నారు. భవిష్యత్తులో పుట్టుకొచ్చే కోవిడ్ వైరస్ రకాలపైనా పోరాడగలదని అంటున్నారు. కాగా, ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్ నేతృత్వంలో ఐఐఎస్సీ మాలిక్యులర్ బయోఫిజిక్స్ యూనిట్ బృందం తయారు చేసిన ఈ టీకాకు ఆర్ఎస్2 అని పేరుపెట్టారు. కోవిడ్-19కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ఈ వ్యాక్సిన్ ఒక విప్లవాత్మకమైన ముందడుగు అని శాస్త్రవేత్తలు అభివర్ణించారు. ఇది వేడిని తట్టుకోగలదని, చల్లని ప్రదేశంలో నిల్వ చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. కరోనా వైరస్‌కు చెందిన స్పైక్ ప్రొటీన్లలోని రెండు కాంపోనెంట్ల సమ్మేళంతో ఆర్ఎస్2 టీకాను అభివృద్ధి చేశారు. ఇదొక సింథటిక్ యాంటీజెన్. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన కరోనా టీకాలతో పోలిస్తే ఆర్ఎస్‌ఈ టీకా మరింత ఎక్కువ రక్షణ ఇస్తుందని ఐఐఎస్సీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఇందులోని ఎస్2 అని సబ్ యూనిట్ వైరస్ మ్యుటేషన్లను సమర్థంగా తట్టుకుంటుందని పేర్కొన్నారు.

మణిపూర్ పవర్ స్టేషన్‌లో ఇంధనం లీక్

ఇంఫాల్ : జాతుల మధ్య వైరంతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో ఒక పవర్ స్టేషన్ నుంచి భారీగా ఇంధనం లీక్ అయ్యింది. కాంగ్‌పోక్పి జిల్లాలోని లీమాఖోంగ్ పవర్ స్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ ఇంధనం నదుల్లోకి చేరకుండా సంబంధిత శాఖలను అప్రమత్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బుధవారం రాత్రి పవర్ స్టేషన్ నుంచి భారీగా ఇంధనం వెలుపలికి రావడం స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. అనేక ప్రాంతాల్లో సెలయేర్లలో పారింది. అక్కడక్కడ మంటలు చెలరేగాయి. ఇంధనం చివరకు దిగువ ఇంఫాల్ లోయలోని నదిలో కలిసే ప్రమాదం ఉండడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. దీనిని కట్టడి చేయాలని సంబంధిత శాఖలకు ఉత్తర్వులు జారీ చేసింది. సిబ్బంది, యంత్రాలను తక్షణమే రంగంలోకి దించాలని ఆదేశించింది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. గత ఏడాది మణిపూర్‌లో మొదలైన జాతుల మధ్య వైరం ఇంకా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంధనం లీక్ చోటుచేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. మరోవైపు బిష్ణుపూర్ జిల్లాలో జరిగిన తాజా హింసాత్మక ఘటనలో నలుగురు కనిపించకుండా పోయారు. సమీపంలో ఉన్న ప్రాంతంలో అల్లం సేకరించేందుకు వెళ్లిన వీరు ఆ తర్వాత తిరిగి రాలేదు. దీంతో పోలీసులు వీరి కోసం గాలింపులు చేపట్టారు.

మోదీ, సంఘ్‌పరివార్ రాముడిని అవమానపరుస్తున్నారు: సిద్ధరామయ్య

బెంగళూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సంఘ్ పరివార్‌లు అయోధ్యలో రామమందిర ప్రారంభ కార్యక్రమాన్ని రాజకీయ ప్రచారానికి ఉపయోగించడం ద్వారా శ్రీరాముడిని, దేశప్రజలను అగౌరవ పరుస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విమర్శించారు. అయోధ్యలో రామమందిర ప్రారంభ కార్యక్రమానికి హాజరు కారాదన్న కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని ఆయన సమర్థించారు. ఈ మేరకు ఆయన గురువారం 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యలు చేశారు. "అయోధ్యలో జరగనున్న రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనబోమని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, మా పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అధిర్ రంజన్ చౌదరి తీసుకున్న నిర్ణయం సరైనదే... నేను దానికి మద్దతు ఇస్తున్నాను. ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించాల్సిన ఈ కార్యక్రమాన్ని రాజకీయ ప్రచార కార్యక్రమంగా మార్చడం ద్వారా ప్రధాని నరేంద్రమోదీ, సంఘ్ పరివార్ నాయకులు శ్రీరాముడిని, 140 కోట్ల మంది ప్రజలను అగౌరవపరిచారు" సిద్ధరామయ్య పేర్కొన్నారు. హిందువులందరినీ ఏకం చేసే కార్యక్రమంగా తలపెట్టిన ఈ కార్యక్రమం బీజేపీ రాజకీయాల వల్ల హిందువులను విభజించే కార్యక్రమంగా మారడం విషాదకరమని సిద్ధరామయ్య అన్నారు. తన ప్రభుత్వ విజయాలను ఏకరువు పెడుతూ ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం ప్రధానికి లేదని... అందుకే హడావుడిగా రామమందిరాన్ని ప్రారంభిస్తున్నారని సిద్ధరామయ్య పేర్కొన్నారు. 'మేము హిందూ మతానికి వ్యతిరేకం కాదు. అంటరానితనం, కులతత్వం, మతోన్మాదం, మతం పేరుతో అవినీతికి వ్యతిరేకం. మతాన్ని రాజకీయాల కోసం ఉపయోగించడాన్ని మేం పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. సమాజాన్ని అన్ని జాతులకు శాంతి వనంగా మార్చాలనే రాజ్యాంగం ఆకాంక్షకు నేను మా పార్టీ కట్టుబడి ఉన్నాం' అని సిద్ధరామయ్య పేర్కొన్నారు.

నాలుగు రాష్ట్రాల్లో ఎన్ఐఏ దాడులు

న్యూఢిల్లీ : జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాల్లో గురువారం దాడులు నిర్వహించింది. దేశ రాజధాని దిల్లీ, హరియానా, పంజాబ్, రాజస్తాన్‌లోని 32 చోట్ల దాడులు చేపట్టింది. గురువారం ఉదయం నుంచి దాడులు కొనసాగుతున్నాయి. ఆయా రాష్ట్రాల పోలీసు బలగాల సమన్వయంతో అధికారుల బృందాలు సోదాలు నిర్వహించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. హరియానాలోని ఝజ్జర్, సోనిపట్‌లోనూ ఎన్ఐఏ తనిఖీలు చేపట్టింది. కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌కు చెందిన రహస్య స్థావరాలపై దాడుల చేసి ఈ నెల 6న ఆస్తులకు సంబంధించిన పత్రాలను ఎన్ఐఏ స్వాధీనం చేసుకుంది. ఈ క్రమంలోనే మరోసారి దాడులు చేపట్టింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం 1967లోని నిబంధనల ప్రకారం హరియానా, పంజాబ్, ఉత్తర ప్రదేశ్‌లో ఎన్ఐఏ బృందాలు సమన్వయంతో ఈ ఆస్తులను స్వాధీనం చేసుకున్నాయి. ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో ఉగ్రవాద ముఠా నాయకుడు వికాస్ సింగ్‌కు చెందిన ఫ్లాట్-77/4, అస్రే-1, సులభ్ ఆవాస్ యోజన, సెక్టార్-1, గోమతి నగర్ ఎక్స్‌టెన్షన్, లక్నో సహా ఆస్తులను జప్తు చేసినట్లు సమాచారం. పంజాబ్‌లోని ఫజిల్కాలోని బిషన్‌పురా గ్రామంలో నిందితుడు దలీప్ కుమార్ అలియాస్ భోలా అలియాస్ దలీప్ బిష్ణోయ్‌కు చెందిన మరో రెండు ఆస్తులు సైతం జప్తు చేశారు. హరియానాలోని యమునానగర్‌కు చెందిన జోగిందర్ సింగ్ పేరుతో రిజిస్టర్ అయిన ఫార్చ్యూనర్ కారును సైతం స్వాధీనం చేసుకున్నారు. పంజాబ్ పోలీసు ప్రధాన కార్యాలయంపై గ్రెనేడ్ దాడిలో పాల్గొన్న నిందితులతో సహా ఉగ్రవాదులకు లారెన్స్ బిష్ణోయ్ సహచుడు వికాస్ సింగ్ ఆశ్రయం కల్పించాడు. జోగిందర్ సింగ్ తన ఫార్చ్యూనర్ కారును ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహించడానికి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని రవాణా చేయడానికి చేస్తూ ముఠా సభ్యులకు సహాయం సహాయం అందిస్తున్నట్లుగా గుర్తించారు. ఆగస్టు 2022లో గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నేరాలపై ఎన్ఐఏ 'ఉపా' చట్టం కింద కేసు నమోదు చేసింది. ఈ ముఠా దేశంలోని అనేక రాష్ట్రాల్లో మాఫియా తరహా నేర వ్యవస్థను విస్తరించిందని దర్యాప్తు సంస్థ విచారణలో వెల్లడయింది. ఈ వ్యవస్థలు ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యతో పాటు అనేక మంది హత్య, దోపిడీలకు పాల్పడ్డాయి. పాకిస్తాన్, కెనడా సహా విదేశాల నుంచి, భారత్‌లోని జైళ్ల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద సంస్థల నేతలు చాలా వరకు కుట్రలు పన్నినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో వెల్లడయింది. ఆయా త్రీవాద, మాఫియా వ్యవస్థను విచ్ఛిన్నం చేసేందుకు ఇటీవల ఎన్ఐఏ పెద్ద ఎత్తున ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో పాటు జప్తు చేస్తుంది.

వందేభారత్‌లో పాడైన ఆహారం

న్యూఢిల్లీ : వందేభారత్ రైలు ప్రయాణికులకు పాడైన ఆహారం అందించడంతో వారు ఆందోళన చేశారు. వాసన వస్తున్న ఆ ఆహారాన్ని వెనక్కి ఇచ్చేసి, డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని రైల్వే అధికారులతో పాటు రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దిల్లీ-వారణాసి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో శనివారం ఈ సంఘటన జరిగింది. ఆధునాతన, వేగవంతమైన ఈ రైలులో అందించిన ఆహారం నాణ్యతపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహారం పాడై వాసన రావడంతో ఫుడ్ ప్లేట్‌లను నేలపై ఉంచారు.

వాటిని వెనక్కి తీసుకోవాలని రైల్వే సిబ్బందిని డిమాండ్ చేశారు. కాగా, ఒక ప్రయాణికుడు దీనిని వీడియో తీశాడు. పాడైన, వాసన వస్తున్న ఆహారాన్ని అందించడంపై తోటి ప్రయాణికుల ఆగ్రహం, ఆవేదనను 'ఎక్స్'లో పోస్ట్ చేశాడు. 'హాయ్ సార్ నేను దిల్లీ నుంచి వారణాసికి 22416 వందేభారత్‌లో ప్రయాణిస్తున్నా. మాకు ఇచ్చిన ఆహారం పాడై దుర్వాసన వస్తోంది. దయచేసి నా డబ్బు మొత్తాన్ని వాపసు చేయండి. ఆహార విక్రేతలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ బ్రాండ్ పేరును పాడు చేస్తున్నారు' అని అందులో పేర్కొన్నాడు. దీనికి సంబంధించిన వీడియో దృశ్యాలను కూడా పోస్ట్ చేశాడు. ఇండియన్ రైల్వే, వందేభారత్ అధికారులు, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు దీనిని ట్యాగ్ చేశాడు. మరోవైపు, ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో అసౌకర్యాలు, నాణ్యత లేని ఆహారం సరఫరా చేస్తున్న రైల్వేపై నెటిజన్లు మండిపడ్డారు.

మెహబూబా ముఫ్తీకి తప్పిన ప్రమాదం

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ గురువారం తృటిలో ఘోర రోడ్డు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆమె ప్రయాణిస్తున్న కారు జమ్మూకాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా సంగమ్‌లో ప్రమాదానికి గురైంది. ప్రమాదం తర్వాత ముఫ్తీ ప్రయాణిస్తున్న కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. అగ్నిప్రమాద బాధితులను కలవడానికి ముఫ్తీ ఖనాబాల్‌కు వెళ్తున్నట్లు సమాచారం. అయితే ప్రమాదంలో ఆమెకు ఎలాంటి గాయాలు కాలేదు. కానీ మెహబూబా భద్రతా సిబ్బందిలోని ఓ పోలీస్ అధికారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి ముఫ్తీ కుమార్తె ఇల్తిజా మాట్లాడుతూ... అనంత్ నాగ్‌లో ప్రయాణిస్తున్న ముఫ్తీ కారు ప్రమాదానికి గురైంది. భగవంతుడి దయ వల్ల ఆమె, భద్రతా అధికారులు సురక్షితంగా బయటపడ్డారు అని తెలిపారు. కాగా ప్రమాద విషయం తెలుసుకున్న నేషనల్ కాన్ఫరెన్స్ నేత, జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ... ముఫ్తీ క్షేమంగా బయటపడ్డారని, అయితే ఈ ఘటనలో ఏవైనా భద్రతా లోపాలు ఉంటే తక్షణమే వాటిపై దృష్టి పెట్టాలని కోరారు.

రాజౌరీలో పేలుడు పదార్థాల స్వాధీనం

రాజౌరి/జమ్మూ: జమ్మూ కాశ్మీర్ రాజౌరి జిల్లాలో టిఫిన్ బాక్స్‌లలో అమర్చిన నాలుగు ఇంప్రవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్ (ఐఈడీ), ఏకే సిరీస్ అసాల్ట్ రైఫిల్స్‌కు చెందిన రెండు డజన్ల బుల్లెట్లను సీఆర్‌పీఎఫ్ బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు గురువారం అధికార వర్గాలు వెల్లడించాయి. ఇంటెలిజెన్స్ విభాగం అందించిన సమాచారం ఆధారంగా సీఆర్‌పీఎఫ్ 237వ బెటాలియన్‌కు చెందిన సి కంపెనీ దళాలు స్థానిక పోలీసులతో కలిసి రాజౌరీ జిల్లాలోని హయత్‌పురా-మంజాకోట్ ప్రాంతంలో గాలింపు చేపట్టాయి. దీంతో టిఫిన్ బాక్సుల్లో దాచిన నాలుగు ఐఈడీలు, ఏకే అసాల్ట్ రైఫిల్స్‌లో ఉపయోగించే 23 లైవ్ బుల్లెట్లు, వైర్‌లెస్ సెట్, టేప్ రికార్డర్ స్వాధీనం చేసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పూంచ్-రజౌరీ ప్రాంతంలో గత రెండేళ్లుగా పాకిస్తాన్‌వైపు నుంచి ఉగ్రవాదులు చొరబాట్లకు పాల్పడుతున్నందున సెర్చ్ ఆపరేషన్‌ను విస్తృతం చేసి, పరిసర ప్రాంతాల్లో సోదాలు జరుపుతున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ ప్రాంతంలో భద్రతా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కేంద్రం సీఆర్‌పీఎఫ్ బలగాలను రంగంలోకి దింపింది. ఆర్మీ, రాష్ట్రీయ రైఫిల్స్ (ఆర్ఆర్) ఆపరేషనల్ యూనిట్లు కూడా ఇక్కడ మోహరించబడ్డాయి.

జమిలీ ఎన్నికలకు మమత 'నో'

న్యూఢిల్లీ: ఒకే దేశం- ఒకే ఎన్నిక(జమిలీ)పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక అంటే నియంతృత్వమే అని మమత విమర్శించారు. దీనిని తమ పార్టీ వ్యతిరేకిస్తునట్టు పేర్కొన్నారు. ఇది ఫెడరల్ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమన్నారు. ఈ మేరకు ఒకే దేశం- ఒకే ఎన్నికపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన అత్యున్నతస్థాయి కమిటీకి ఓ లేఖ రాశారు. ఒకే దేశం- ఒకే ఎన్నిక అనేది దేశ రాజ్యాంగ ఏర్పాట్లకు సంబంధించిన ప్రాథమిక నిర్మాణానికి వ్యతిరేకమని మమత స్పష్టం చేశారు. ఈ విధానంతో తాను ఏకీభవించనన్నారు. 1952లో తొలి సార్వత్రిక ఎన్నికలు లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి నిర్వహించిన విషయాన్ని మమత ప్రస్తావించారు. అయితే కొన్నేళ్లపాటు సాగిన ఆ ప్రక్రియ క్రమంగా కనుమరుగైనట్లు చెప్పారు. ఒకే దేశం- ఒకే ఎన్నిక భావనతో తాను ఏకీభవించటం లేదని స్పష్టం చేశారు. ఈ విధానం సూత్రీకరణ, ప్రతిపాదనతో విభేదిస్తున్నట్లు పేర్కొన్నారు. వెస్ట్‌మినిస్టర్ వ్యవస్థలో సమాఖ్య, శాసనసభలకు ఏకకాలం కాని ఎన్నికలు ప్రాథమిక లక్షణమని, దాన్ని మార్చకూడదన్నారు. ఏకకాలం కాని ఎన్నికలు దేశ రాజ్యాంగ ఏర్పాట్లకు సంబంధించిన ప్రాథమిక నిర్మాణంలో భాగమని మమత పేర్కొన్నారు. కాగా జమిలి ఎన్నికల నిర్వహణపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి బుధవారం వరకు 5వేలకుపైగా సూచనలు అందాయి. జమిలి ఎన్నికల నిర్వహణపై సూచనలు సలహాలు ఇవ్వాలని గతవారం కోరిన కోవింద్ కమిటీ అందుకు జనవరి 15వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ఇప్పటివరకు 5వేలకుపైగా ఈ-మెయిల్స్ వచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలు, స్థానికసంస్థలకు ఒకేసారి ఎన్నికలు జరిపేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై రామ్‌నాథ్ కమిటీ ఇప్పటికే రెండుసార్లు సమావేశమైంది. జమిలి ఎన్నికల నిర్వహణపై అభిప్రాయల కోసం పలు రాజకీయ పార్టీలకు లేఖ కూడా రాసింది. లా కమిషన్ అభిప్రాయలను కూడా కమిటీ తీసుకుంది. జమిలీ ఎన్నికల సాధ్యాసాధ్యాలను పరిశీలించే కమిటీలో అధికార, ప్రతిపక్ష నేతలతో పాటు శాసన, న్యాయ, ఆర్థిక నిపుణులకు కేంద్రం స్థానం కల్పించింది. కమిటీలో రామ్‌నాథ్ కోవింద్‌తో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి, రాజ్యసభ మాజీ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్, 15వ ఆర్థిక సంఘం మాజీ ఛైర్మన్ ఎన్‌కే సింగ్, సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ డాక్టర్ సుభాశ్ సీ కశ్యప్, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారి ఉన్నారు.

'క్లీన్ సిటీ'గా ఇండోర్

న్యూఢిల్లీ : మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్ నగరం మరోసారి సత్తా చాటింది. దేశంలోనే అత్యంత పరిశుభ్ర నగరాల జాబితాలో తొలి స్థానం దక్కించుకొంది. 2023 సంవత్సరానికిగాను ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును వరుసగా ఏడోసారి కైవసం చేసుకుంది. ఈ ఏడాది ఇండోర్‌తో పాటు గుజరాత్‌లోని సూరత్ కూడా సంయుక్తంగా మొదటి స్థానం దక్కించుకుంది. నవీ ముంబై ఈ జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన విశాఖపట్నం (4), విజయవాడ (6), తిరుపతి (8), హైదరాబాద్ (9) నగరాలు మొదటి 10 అగ్రశ్రేణి నగరాల జాబితాలో ఉన్నాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి పాల్గొన్నారు. పరిశుభ్రతలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

కర్నాటకలో లాడ్జిలో జంటపై దాడి

మతపరమైన ఘటనగా అనుమానం

బెంగళూరు : కర్నాటకలో దారుణ ఘటన చోటుచేసుకుంది. లాడ్జి గదిలోకి అక్రమంగా చొరబడిన కొందరు దుండగులు ఓ జంటపై విచక్షణారహితంగా దాడి చేశారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ... ఇద్దరినీ కొడుతూ వీడియో రికార్డ్ చేశారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. జనవరి 7న హావేరీ జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వైరల్ అవుతున్న వీడియోలో రికార్డయిన దృశ్యాల ప్రకారం... ఈ ఇద్దరూ వేర్వేరు మతాలకు చెందినవాళ్లుగా తెలుస్తోంది. హనగల్ తాలుకాలోని లాడ్జిలో ఈ జంట బస చేస్తున్నారనే సమాచారం తెలుసుకున్న మైనార్టీ వర్గానికి చెందిన ఆరుగురు వ్యక్తుల గుంపు హోటల్‌లోకి ప్రవేశించారు. లాడ్జిలోని గది నంబర్ వద్దకు వెళ్లి తలుపు తట్టారు. ఓ వ్యక్తి డోర్ తీయడంతో వెంటనే రూమ్‌లోని ప్రవేశించి నేరుగా యువతి వద్దకు పరుగెత్తారు. దీంతో మహిళ భయపడి తన ముఖాన్ని బుర్ఖాతో కప్పుకునే ప్రయత్నం చేసింది. అయినా అంగతకులు యువతిపై దాడికి దిగారు. గట్టిగా కొట్టడంతో ఆమె కిందపడిపోయింది. ఆమెతో ఉన్న వ్యక్తిపై కూడా దాడి చేసేందుకు రాగా అతడు బయటకు పరుగెత్తడానికి ప్రయత్నించాడు. ఇద్దరు, ముగ్గురు దుండగులు అతడిని లోపలికి ఈడ్చుకొచ్చి కొట్టారు. యువతిపై సైతం అనేక సార్లు దాడికి పాల్పడ్డారు. లాడ్జి బయట తీసిన మరో వీడియోలో యువతి బుర్ఖాతో ముఖాన్ని కప్పుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తుంటే... ఆ వ్యక్తులు ఆమె హిజాబ్‌ను తొలగించి వీడియో తీశారు. అనంతరం వారు అక్కడి నుంచి పరారయ్యారు. అంగతకుల దాడిలో గాయాలపాలైన జంట హనగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన ఆరుగురిలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు మైనారిటీ వర్గానికి చెందిన వారుగా గుర్తించారు. మిగిలిన నలుగురి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా దాడికి పాల్పడింది ఎవరూ? ఎందుకు కొట్టారనే విషయాలు తెలియాల్సి ఉంది.

అయితే యువతీయువకుల మతాలు వేరుకావడం కారణంగానే దుండగులు దాడి చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా మతాంతార వివాహం చేసుకున్న జంటగా పొరబడి బెలగావిలో ఇద్దరు బంధువులను కొంతమంది దారుణంగా కొట్టిన సంగతి తెలిసిందే. భిన్న మతాలకు చెందిన యువతి, యువకుడు పక్క పక్కన కూర్చున్నారనే కారణంతో దాడి చేశారు. తనను విడిచిపెట్టాలని కోరినా... యువకుడిని పైపులు, రాడ్లతో చితకబాదారు. యువతిని వేధించారు. బాధితులిద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మొత్తం 7 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ ఘటన జరిగిన మూడు రోజులకే మరో ఉదంతం వెలుగుచూడటం గమనార్హం.

నవాబ్ మాలిక్‌కు మధ్యంతర బెయిల్ పొడిగింపు



న్యూఢిల్లీ : మనీ లాండరింగ్ కేసులో మహారాష్ట్ర మాజీ మంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) నాయకుడు నవాబ్ మాలిక్‌కు సుప్రీం కోర్టు ఊరటనిచ్చింది. ఈ కేసులో మధ్యంతర బెయిల్‌ను కోర్టు మరో ఆరు నెలలు పొడిగించింది. ఈడీ తరపున కోర్టుకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు బెయిల్‌పై ఎలాంటి అభ్యంతరం తెలుపకపోవడంతో న్యాయమూర్తులు జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిథాల్ ధర్మాసనం నవాబ్ మాలిక్ బెయిల్‌ను పొడిగించింది. ఇంతకుముందు ఆయనకు ఆరోగ్య సమస్యల నేపథ్యంలో వైద్యం చేయించుకునేందుకు కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అలాగే అక్టోబరు 12న సైతం మూడు నెలలు పొడిగించింది. మనీ లాండరింగ్ కేసులో వైద్యం చేయించుకునేందుకు బాంబే హైకోర్టును ఆశ్రయించగా, గత ఏడాది జులై 13న బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ 'సుప్రీం'ను ఆశ్రయించారు. మాలిక్ తాను కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నానని... వైద్యం చేయించుకునేందుకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. దీంతో కోర్టు గత ఏడాది ఆగస్టు 11న రెండు నెలల పాటు బెయిల్‌ను మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. భారత్ మోస్ట్ వాటెండ్ ఉగ్రవాది దావూద్ ఇబ్రహీం, అతని అనుచరుల కార్యకలాపాలకు సంబంధించిన కేసులో ఈడీ 2022 ఫిబ్రవరిలో నవాబ్ మాలిక్‌ను అరెస్టు చేసింది.

అంగన్‌వాడీల అలుపెరగని పోరు

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం/ విజయవాడ చిట్టినగర్: అంగన్‌వాడీలు అలుపెరగని పోరు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినా ఏమాత్రం వెనుకాడడం లేదు. పైగా ఆందోళనలను మరింత ఉధృతం చేశారు. గురువారం అంగన్‌వాడీల ఉద్యమం 31వ రోజుకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగించారు. దీనిలో భాగంగా విశాఖపట్నంలో గురువారం అంగన్‌వాడీ కార్మికుల దీక్షా శిబిరాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడకుండా నెల రోజులుగా పోరాటం చేస్తున్న అంగన్‌వాడీలను అభినందించారు. ఇటీవల కాలంలో అంగన్‌వాడీలది గొప్ప పోరాటమని కొనియాడారు. అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం దిగిరాకపోతే వామపక్ష పార్టీలు, తెలుగుదేశం, కాంగ్రెస్, జనసేన అండగా నిలిచి పోరాటంలోకి దిగుతాయని హెచ్చరించారు. అంగన్‌వాడీల పోరాటంపై ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడం సిగ్గుచేటని విమర్శించారు. అంగన్‌వాడీలు నిరసనలు చేస్తుంటే అరెస్టులు చేయడం, విధులకు హాజరు కాకపోతే ఉద్యోగాలు తీసేస్తామని బెదిరించడాన్ని ఖండించారు. మీరు ఎస్మాను ప్రయోగిస్తే ప్రజలు ఓటు హక్కును ఉపయోగించి సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో సమస్యలను పక్కనపెట్టి తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చున్న సీఎం జగన్, వచ్చే ఎన్నికలకు ఎమ్మెల్యేలను బదిలీలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర పాలన గాలికి వదిలేశారని విమర్శించారు. రాజకీయాలు తప్ప పరిపాలన ఈ ముఖ్యమంత్రికి చేతకాదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, జి.ఎస్.జె.అచ్యుతరావు, ఎస్.కె.రెహమాన్, కె.సత్యాంజనేయ, క్షేత్రపాల్, పి.చంద్రశేఖర్, ఆర్.శ్రీనివాసరావు, ఎం.మన్మధరావు, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాలతో సీఎంకు వినతిపత్రం: అంగన్‌వాడీ జేఏసీ నేతలు

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి తక్షణమే ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోరుతూ కోటి సంతకాలతో వినతి పత్రం అందజేయనున్నట్లు అంగన్‌వాడీ కార్మికుల జేఏసీ నేతలు తెలిపారు. విజయవాడ గాంధీనగర్ ధర్నా చౌక్ వద్ద అంగన్‌వాడీ కార్మికుల దీక్షా శిబిరంలో వారు మీడియాతో మాట్లాడారు. ఏఐటీయూసీ అనుబంధ ఆంధ్ర ప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, సీఐటీయూకు చెందిన ఆంధ్ర ప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, మినీ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, అధ్యక్షులు బేబీ రాణి, ఐఎఫ్‌టీయూకు చెందిన ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఆర్.జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికుల సమస్యలపై మూడు పర్యాయాలుగా మంత్రుల కమిటీతో జరిపిన చర్చలు ఫలించలేదన్నారు. పాలక పెద్దల్లో చిత్తశుద్ధి కొరవడటమే ఇందుకు కారణమని విమర్శించారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుండా ఎస్మాను ప్రయోగిస్తూ జీవో నంబర్ 2ను జారీ చేయటం సమంజసం కాదన్నారు. ఎస్మాను ప్రయోగించినప్పటికీ అంగన్‌వాడీలు తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్స్, మినీ వర్కర్స్, హెల్పర్లకు షోకాజు నోటీసులు ఇస్తూ, అధికారుల ద్వారా అన్ని జిల్లాల్లోని కార్మికులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తోందని మండిపడ్డారు. తక్షణమే ఎస్మా జీవో నంబరు 2ను రద్దు చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, లబ్ధిదారుల నుంచి కోటి సంతకాలు సేకరించి సీఎం జగన్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. సంక్రాంతి పండుగను కూడా షామియానా ఉద్యమ శిబిరాల్లోనే నిర్వహించడానికి నిర్ణయించామని, భోగి మంటల్లో అంగన్‌వాడీ టీచర్లకు, మినీ టీచర్లకు, హెల్పర్లకు ఇచ్చే నోటీసులను కాల్చివేస్తామని, సంక్రాంతి పండుగ తర్వాత కూడా తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విషమంగానే అంజాన్ ఆరోగ్యం

- లక్నో మాయో ఆసుపత్రిలో చికిత్స
- డి.రాజా పరామర్శ

న్యూఢిల్లీ: సీపీఐ జాతీయ కార్యదర్శి, అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ ఆరోగ్యం విషమించింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో తొలుత ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స అందించారు. చివరి రోజులు లక్నోలో గడపాలన్న అంజాన్ కోరిక మేరకు ఆయనను ఉత్తరప్రదేశ్ రాజధాని నగరంలోని మాయో ఆసుపత్రికి తరలించారు. అంజాన్ కుటుంబం అక్కడే ఉంటుంది. ఈ మేరకు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఎక్స్ మాధ్యమంగా తెలిపారు. అంజాన్ ఆరోగ్యం గురించి సమాచారం అందిన వెంటనే రాజా ఆసుపత్రికి చేరుకున్నారు. ఎప్పటికప్పుడు వైద్యుల నుంచి అంజాన్ ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకుంటున్నట్లు సీపీఐ ప్రకటన తెలిపింది. అతుల్ కుమార్ అంజాన్ ఆరోగ్యం విషమించడంతో కుటుంబ సభ్యులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు తల్లడిల్లిపోయారు. ఆయన కోలుకుంటారని ఆకాంక్షిస్తున్నారు. కాగా, అంజాన్ సీపీఐ డైనమిక్ నేత. మంచి వక్త, రచయిత కూడా. విద్యార్థి ఉద్యమం నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. చాలా కాలం పాటు లక్నో యూనివర్సిటీ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారు. అంజాన్ లక్నోలోని స్టేట్ బోర్డ్ స్కూల్‌లో చదువుకున్నారు. 1967, 1972, 1976, 1983 సంవత్సరాలలో లక్నో విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఎల్ఎల్‌బీ పట్టాలు పొందారు. 1978లో అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఉత్తరప్రదేశ్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన క్రమంగా జాతీయ అధ్యక్షుడి స్థాయికి ఎదిగారు. ఆయన ఘోసి (లోక్‌సభ నియోజకవర్గం) నుంచి సీపీఐ అభ్యర్థిగా అనేకసార్లు పోటీ చేశారు.

ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం

- 25 కల్లా పోలింగ్ స్టేషన్లు, వసతుల కల్పన
- చెక్ పోస్టుల్లో పటిష్ఠ బందోబస్తు
- ప్రభుత్వ ప్రధానకారదర్శి జవహర్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలో త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో డీజీపీ, వివిధ శాఖల ఉన్నత అధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సార్వత్రిక ఎన్నికలకు చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. శాఖల వారీగా ఏర్పాటు చేస్తున్న పోలింగ్ స్టేషన్లు, వాటిలో కనీస మౌలిక వసతుల కల్పన పనులను ఆయన సమీక్షించారు. ఈ పనులన్నింటినీ ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల విద్య, ఉన్నత విద్య, పురపాలక శాఖకు చెందిన పాఠశాలలతో పాటు గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, పంచాయతీ భవనాలు, అంగన్ వాడీ కేంద్రాల్లో పోలింగ్ స్టేషన్లు పెద్ద మొత్తంలో ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల నిర్మాణం తప్పని సరిగా చేపట్టాలని, విద్యుత్ సౌకర్యంతో పాటు లైట్లు, ఫ్యాన్లు, ఫర్నిచర్, తాగునీరు, టాయిలెట్లు తప్పని సరిగా ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డితో ప్రత్యేకంగా చర్చించారు. మద్యం అక్రమ రవాణాను అరికట్టడం, పటిష్ఠ పోలీస్ బందోబస్తు, చెక్ పోస్టుల ఏర్పాట్లు, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం, విచారణలో ఉన్న కేసులకు సంబంధించి త్వరలో ఛార్జిషీట్లు ఫైల్ చేయడం తదితర అంశాలపై సమీక్షించారు. అన్ని కీలక కేంద్రాల్లో పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని, ప్రత్యేకించి రాష్ట్రాల సరిహద్దుల వద్ద చెక్ పోస్టుల ఏర్పాటుతో పాటు పోలీస్ బలగాలను మోహరించాలని సూచించారు.

31 నుంచి పార్లమెంట్

1న మధ్యంతర బడ్జెట్

న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈనెల 31 నుంచి జరగబోతున్నాయి. ఫిబ్రవరి ఒకటో తేదీన ఓటాన్ అకౌంట్ లేదా మధ్యంతర బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతోంది. ఫిబ్రవరి 9 వరకు పార్లమెంటులో బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. ఈనెల 31న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్నది. ఈ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ కాగా సార్వత్రిక ఎన్ని కల తర్వాత ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెడుతుంది. 17వ లోక్‌సభ పదవీ కాలం జూన్ 16తో ముగియనుంది. బడ్జెట్ సమావేశాల తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. కాగా, 2019లో మార్చి 10న సార్వత్రిక ఎన్నికలను ప్రకటించారు. ఏప్రిల్ 11 నుంచి మే 19వ తేదీ వరకు ఏడు దశల్లో పోలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే.

భూయాజమాన్య హక్కు చట్టాన్ని

రద్దు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర – విశాఖ: భూ యాజమాన్య హక్కు చట్టం 2023ని తక్షణం రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. విశాఖలో జిల్లా కోర్టు వద్ద ఈ చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న న్యాయవాదుల నిరసన దీక్షా శిబిరాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టాన్ని భూ కబ్జాదారుల కోసమే తెచ్చారని ప్రజలు భయపడుతున్నారని చెప్పారు. ఈ చట్టంపై రైతు సంఘాలతో సమగ్ర చర్చలు జరపలేదని అన్నారు. లాయర్ల అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు. ఈ చట్టం నిబంధనలు తయారు కాలేదని, అందరితో చర్చిస్తామని మంత్రి ధర్మాన ప్రసాదరావు చెబుతున్నారని.., ఏకపక్షంగా దొడ్డిదారిన చట్టం తెచ్చి ఆ తరువాత చర్చలు జరుపుతామని చెప్పడం సబబు కాదని అన్నారు. మూడు నెలల్లో ఎన్నికల్లో ఉన్నాయని, కొత్త ప్రభుత్వం ఈ అంశాన్ని చూసుకుంటుందని అన్నారు. నీతి అయోగ్ ఈ చట్టం చేయాలని చెప్పిందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నదని, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు కూడా తొందరపడలేదని, ఈ చట్టాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తొందర పడుతోందని ప్రశ్నించారు. నరేంద్ర మోదీ, అమిత్ షా మెప్పు పొందడానికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భూహక్కు చట్టాన్ని తీసుకువస్తోందని విమర్శించారు. వెంటనే భూ యాజమాన్య హక్కు చట్టం 2023ను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ విమల, జీఎస్‌జే అచ్యుతరావు, ఎస్కే రెహమాన్, కె సత్యంజనేయ, క్షేత్రపాల్, పి చంద్రశేఖర్, ఆర్ శ్రీనివాసరావు, ఎం మన్మధరావు, జి రాంబాబు, ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఎస్ సురేష్ కుమార్, జాతీయ కమిటీ సభ్యుడు ఎం ఎస్ ఎం భగవతి, రాష్ట్ర కార్యదర్శి జీజే ఆర్ అజయ్ కుమార్, ఉపాధ్యక్షులు జహా ఆరా, ఐఎం అహ్మద్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రభుత్వాలు కావు...

రాబందుల ప్రభుత్వాలు

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య విమర్శ

విశాలాంధ్ర–కడప కార్పొరేషన్ : ఎన్నికల ముందు వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని మోదీ, పండగ చేస్తామని జగన్ నమ్మబలికి అధికారంలోకి వచ్చి రైతాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు జి.ఈశ్వరయ్య విమర్శించారు. రానున్న రోజుల్లో సమరశీల పోరాటాల ద్వారా పాలకులకు తగిన బుద్ధి చెప్పాలని గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. పంటల సాగుకు అవసరమైన విత్తనాలు ఎరువులు పురుగుమందుల ధరలు, కూలీ ఖర్చులు ఏటా పెరుగుతున్నాయనీ, పెట్టుబడిలకు తగ్గట్టు గిట్టుబాటు ధరలు కల్పిం చడంలో పాలక ప్రభుత్వాలు ఘోరంగా విఫల మయ్యాయి అన్నారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత లేకపోవడం వల్ల వ్యాపారుల దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అడ్డుకోవాల్సిన పాలక ప్రభుత్వం బ్లాక్ మార్కెట్‌ను పెంచి పోషిస్తోంద న్నారు. అతివృష్టి అనావృష్టితో చేసిన అప్పులు తీర్చలేక అవమానభారంతో రైతులు ఆత్మ హత్యలు చేసుకుంటున్నారని వ్యవసాయ రుణాలు పూర్తిగా మాఫీ చేసి రైతులను రుణ విముక్తి గావించాలని, డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని ఘోషిస్తున్న రైతు సంఘాల విజ్ఞప్తులను పెడచెవిన పెట్టిన మోదీ ప్రభుత్వం ఏకంగా వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి ఏకకాలంలో ఇటు రైతులను అటు వినియోగదారులను దోపిడీ చేసేందుకు సాగు చట్టాలు తెచ్చింది అన్నారు. రాష్ట్రాల మధ్య నీటి తగువులను పరిష్కరించాల్సిన ప్రభుత్వం మరింత జటిలం చేస్తూ ఎగువ భద్ర పేరుతో, కృష్ణాజలాల పునసమీక్ష పేరుతో రాజకీయ స్వార్థానికి ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాలను కాలరాస్తున్నదన్నారు. తమది రైతాంగ ప్రభుత్వమని చెప్పుకుం టున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కేంద్రంలో బీజేపీ తీసుకుంటున్న రైతు వ్యతిరేక చర్యలను బేషరతుగా సమర్థిస్తూ రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను కాపాడడంలో ఘోరంగా విఫలమయ్యా రన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అన్న జగన్ రైతు భరోసా రాష్ట్ర వాటా 12 వేలకు బదులు 7500 ఇచ్చిన నాడే ఆయన వైఖరి బయటపడింది అన్నారు. ప్రతిష్టా త్మకంగా చేపట్టిన రైతు భరోసా కేంద్రాలు వైసీపీ రాబందుల కేంద్రాలుగా మారాయన్నారు. కోట్ల రూపాయల ఖర్చు చేసి భవనాల కట్టినప్పటికీ స్థానికంగా రైతుల అవసరాలకు తగ్గట్టు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సమకూర్చడంలో విఫలమయ్యా రన్నారు. పర్యవసానంగా నకిలీల బెడదతో రైతులు నిలువునా నష్టపోతున్నారన్నారు. ప్రాజెక్టు లకు తగినన్ని నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రతి గ్రామానికి తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తానన్న వాగ్దానం నెరవేరలేకపోయిం దన్నారు. నిధులులేమితో కాంట్రాక్టర్లు పరారవుతున్నారన్నారు. విలేకరుల సమా వేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మూలె వెంకటసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, ఉపాధ్యక్షులు బాలచంద్రయ్య, చంద్రశేఖర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నూతన కార్యదర్శులు వీరే

రాజమహేంద్రవరంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలో కార్యదర్శులుగా దేగా ప్రభాకర్, కె. జగన్నాథం, వి.జమలయ్య, సి.మల్లికార్జున, బుడితి అప్పలనాయుడు ఎన్నికయ్యారు.

పెరిగిన నిరుద్యోగం

- యువతకు సన్నగిల్లిన ఉపాధి అవకాశాలు
- పట్టణాల కంటే గ్రామాల్లోనే అధికం
- సీఎంఐఈ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు, రోజ్‌గార్ మేళాల పేరిట ప్రచార్భాటాన్ని కొనసాగిస్తుండగా అందుకు భిన్నమైన రీతిలో దేశంలో నిరుద్యోగం పెరిగిపో తుండటాన్ని సర్వేలు సూచిస్తున్నాయి. 20–24 ఏళ్ల వారికి ఉద్యోగాలు లేవని, గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయని చెబుతున్నాయి. నిరుద్యోగ రేటు 44.49శాతంగా ఉన్నట్లు సెంటర్ ఫర్ ఆనిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) నివేదించింది. 2023లో అక్టోబరు–డిసెంబరు త్రైమాసికంలో 20–24 మధ్య వయస్కుల్లో నిరు ద్యోగ రేటు 44.49శాతానికి పెరిగిందని, 25–29 ఏళ్ల వారిలో 14.33శాతంగా ఉన్నదని తెలిపింది. 2023 జులై–సెప్టెంబరు త్రైమాసికంలో 20–24 ఏళ్ల వారి నిరుద్యోగ రేటు 43.65శాతంగా ఉంటే 25–29 ఏళ్ల వారిలో 13.35శాతంగా ఉందని తెలిపింది. అక్టోబరు–డిసెంబరు త్రైమాసికంలో 25–29 వయస్సుగల వారిలో నిరుద్యోగ రేటు 14 త్రైమాసికాల గరిష్ఠంగా నమోదైనట్లు సీఎంఐఈ వెల్లడించింది. 30–34ఏళ్ల వారిలో 10 త్రైమాసికాల గరిష్ఠ స్థాయిలో నిరుద్యోగం ఉన్నట్లు తెలిపింది. అక్టోబరు–డిసెంబరులో 2.49శాతంగా నమోదైందని తెలిపింది. అదే జులై– సెప్టెంబరు త్రైమాసికంలో ఇది 2.06శాతంగా ఉందని పేర్కొంది. పట్టణాలతో పోల్చితే గ్రామీణ స్థాయిలో నిరుద్యోగం ఎక్కువని సీఎంఐఈ వెల్లడించింది. 20–24 ఏళ్ల గ్రామీణ యువతలో నిరుద్యోగ రేటు 43.79శాతంగా ఉంటే 25–29ఏళ్ల వారిలో 13.06శాతంగా, 30–34 ఏళ్ల వారిలో 2.24శాతంగా ఉన్నట్లు నివేదించింది. అదే పట్టణాల్లో ఈ ఏడాది రెండవ త్రైమాసికం కంటే మూడవ త్రైమాసికంలో కాస్త మెరుగైన ఫలితాలు వచ్చాయని తెలిపింది. 20–24 ఏళ్ల వారి నిరుద్యోగ రేటు 47.61శాతం నుంచి 45.98శాతానికి తగ్గగా 30–34 వయస్కులకు సంబంధించి 3.29శాతం నుంచి 3.04శాతానికి తగ్గిందని తెలిపింది. అదే సమయంలో 25–29 ఏళ్ల వారిలో నిరుద్యోగ రేటు 15.61శాతం నుంచి 16.54శాతానికి పెరిగినట్లు పేర్కొంది. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) డేటా కూడా సీఎంఐఈ గ్రామీణ నిరుద్యోగ డేటాను పోలివుంది. ఎంజీఎన్ఆర్ఈజీఏ లెక్కల ప్రకారం మూడవ త్రైమాసికంలో పనికి డిమాండు ఏటేటా 1.3శాతం మేర పెరుగుతుంది కానీ రెండవ త్రైమాసికంలో ఇది 15.1శాతం కంటే తక్కువగా ఉందని తెలుస్తోంది. మరోవైపు ఆర్థికవేత్తలు సీఎంఐఈ డేటా విశ్వసనీయతపై సందేహాలు వ్యక్తంచేశారు. సీఎంఐఈ నిరుద్యోగ రేటు నెల వారీగా మారుతూ ఉంటుందని, శాశ్వత ఉద్యోగాలు లేని అసంఘటిత రంగంపై ఆధారమే ఇందుకు కారణమని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రధాన ఆర్థికవేత్త మదన్ సబ్నవిస్ అభిప్రాయపడ్డారు.

చిక్కుల్లో 'అన్నపూరణి'

- నెట్‌ఫ్లిక్స్ నుంచి తొలగింపు
- హిందువుల మనోభావాలు దెబ్బతిన్నట్లు వివాదం
- విశ్వహిందూ పరిషత్‌కు నిర్మాణ సంస్థ క్షమాపణ

న్యూఢిల్లీ: రాముడు మాంసం తిన్నాడు వంటి డైలాగులకు తోడు హీరో ముస్లిం, హీరోయిన్ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వారిగా చూపడంతో తమిళ చిత్రం 'అన్నపూరణి' వివా దాల్లో చిక్కుకుంది. హిందువుల మనోభావాలను కించపర్చినట్లుగా, లవ్ జిహాద్‌ను ప్రోత్సహిం చేలా ఈ సినిమా ఉందని విశ్వహిందూ పరిషత్ వర్గాలు మండిపడ్డాయి. సామాజిక మాధ్య మాల్లో దుమారం రేపాయి. వివాదం పెద్దది కావడంతో ఈ సినిమాను స్ట్రీమింగ్ నుంచి తొలగిస్తున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. ఈ చిత్రంతో హిందువుల మనోభావాలను దెబ్బ తీసినట్లు హిందుత్వ కార్యకర్తలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. దీంతో చిత్ర నిర్మాత జీ5 క్షమాపణలు తెలుపుతూ విశ్వ హిందూ పరిషత్‌కు లేఖ పంపింది. 'అన్నపూరణి' గతేడాది డిసెంబరు 1న విడుద లైంది. ది గాడెస్ ఆఫ్ ఫుడ్ అనే ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కిన ఈ సినిమా విడుదల రోజు నుంచే వివాదాలో చిక్కుకుంది. కొద్దిరోజుల క్రితం నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో కన్నడం, తమిళం, తెలుగు, హిందీ, మలయాళం భాషల్లో అందుబాటులోకి వచ్చింది. అయితే వివాదం పెరగడం, చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించిన నయనతార, జై, సత్యరాజ్‌లపై కేసులు నమోదు కావడంతో నిర్మాణ సంస్థ వెనక్కు తగ్గింది. 'అన్నపూరణి' చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్ తొలగించింది. 'ఎవరి మతపరమైన మనోభావాలను దెబ్బతీయడం మా ఉద్దేశం కాదు. మా సహ-నిర్మాతల్లో హిందువులు, బ్రాహ్మణులు ఉన్నారు. ఎవరినీ కించపర్చాలను కోలేదు. అలా జరిగినందుకు చింతిస్తున్నాం. ఆయా వర్గాలను క్షమాపణ కోరుతున్నాం' అని జీ5 సంస్థ పేర్కొంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్‌తో ఈ చిత్రం గతేడాది డిసెంబరులో తమిళనాడు థియేటర్లలో ప్రదర్శించబడింది. హిందూ ఐటీసెల్ అనే సంస్థ ముంబైలో నయనతార సహా చిత్ర బృందంపై ఎఫ్ఐఆర్‌ను ఈనెల 8న దాఖలు చేసింది. సినిమా నిర్మాతలతో పాటు ప్రసార మాధ్యమం నెట్‌ఫ్లిక్స్ ఇండియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. తమ మనోభావాలు దెబ్బతీసేలా చిత్ర నిర్మాతలు రాముడిని కించపరిచారని శివసేన మాజీ నేత రమేశ్ సోలంకి ఆరోపించారు. లవ్ జిహాద్‌ను ప్రోత్సహించేలా సినిమా ఉందని, నిర్మాతలపై చర్యలు తీసుకోవాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అన్నపూరణి దర్శకుడు నీలేశ్ కృష్ణ, నయనతార, నిర్మాతలతో పాటు నెట్‌ఫ్లిక్స్ ఇండియాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. కొన్ని డైలాగులు హిందూ వుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని విశ్వహిందూ పరిషత్ నాయకుడు శ్రీరాజ్ నాయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో విశ్వ హిందూ పరిషత్‌కు జీ స్టూడియోస్ క్షమాపణలు చెబుతూ ఈ చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్ నుంచి తొలగించింది.

విప్లవ జోహార్లు

సి.పి.ఐ. ఒంగోలు నగర కార్యదర్శి
బొమ్మిశెట్టి చంద్రశేఖర్
మరణానికి ఇవే మా విప్లవ జోహార్లు.
బొమ్మిశెట్టి చంద్రశేఖర్ సంస్మరణ సభ :
తేది : 12-01-2024 శుక్రవారం ఒంగోలులోని భాగ్యనగర్ 3వ లైనులోని పార్క్‌ఎవెన్యూ అపార్ట్‌మెంట్ వద్ద జరుగును. తెలియజేయడమైనది.

కీ॥శే॥ బొమ్మిశెట్టి చంద్రశేఖర్ గారు
సి.పి.ఐ. ఒంగోలు నగర సహాయ కార్యదర్శి
జననం : 28-01-1964 మరణం : 02-01-2024

ఎం.ఎల్. నారాయణ – సిపిఐ జిల్లా కార్యదర్శి
పి.వి.ఆర్. చౌదరి – సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి
వడ్డే హనుమారెడ్డి – ఏ.పి. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు
ఉప్పుటూరి ప్రకాశరావు – సిపిఐ సీనియర్ నాయకులు
కరవది సుబ్బారావు – డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
ముదువర్తి రాఘవరావు – సీనియర్ అడ్వకేట్, ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్
పోతినేని వెంకటేశ్వర్లు – సీనియర్ అడ్వకేట్, పిడిసిసి బ్యాంక్ చైర్మన్
ఎం.సి. వెంకటేశ్వర్లు – కమ్యూనిజం పత్రిక ఎడిటర్
కొత్తకోట వెంకటేశ్వర్లు – ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి
ఎస్.డి. సర్దార్ – ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు
కె. వీరారెడ్డి – ఏ.పి. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి
బి.వి. సుబ్బారావు – ఎల్.ఐ.సి. డెవలప్‌మెంట్ ఆఫీసర్
బంగారు బాబు – ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్
కె. అంజయ్య – ఎఐటియుసి ఒంగోలు నగర కార్యదర్శి
కారుమూడి నాగేశ్వరరావు – సిపిఐ నాయకులు
పావులూరి అంజయ్య – సిపిఐ నాయకులు
గోరంట్ల పిచ్చియ్య – రిటైర్డ్ లెక్చరర్
పుల్లంశెట్టి వెంకట కృష్ణారావు

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.